# మహిళా సాధికారత

MAHILA SADHIKARATHA

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాసపత్రిక

mas

సంపుటి :17 సంచిక: 11 రంగారెడ్డి జులై 2019 పేజీలు : 36 వెల : రూ. 10/-




ప్రసంగిస్తున్న ప్రధానవక్త శ్రీ శ్రీరామ్... ప్రసంగిస్తున్న శ్రీమతి నందితారే, వేదికపై ఇంకా (ఎడమనుంచి) ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి డైరెక్టర్ జనరల్ శ్రీ బి పి ఆచార్య, 'మాస్' బోర్డ్ ఛైర్మన్ శ్రీ కె మాధవరావు, 'మాస్' ఎం డి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి






'మాస్' 18 వ వార్షికోత్సవం; కేక్ కట్ చేస్తున్న మాస్ తొలి ఛైర్మన్ శ్రీ పి. కోటయ్య

Brot für die Welt బ్రెడ్ ఫర్ ది వరల్డ్ సౌజన్యంతో

## 'మాస్' కార్యక్షేత్రాలలో 'మాస్' భాగస్వామ్య సంస్థల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాల చిత్ర మాలిక























సంపాదకీయం



# ముమ్ముందుకు ...

**18** సంవత్సరాలు ! అందునా తొలి పద్దెనిమిది ఏళ్ళు! వ్యక్తికైనా, సంస్థకైనా, వ్యవస్థకైనా అతి కీలకమైన కాలం. సాధారణంగా తొలి అడుగులే భవిష్యత్తును నిర్ణయిస్తాయి కదా! ఎంచుకున్న ఆశయ సాధన దిశగా అంకితభావంతో సాగిస్తున్న ప్రస్థానంలో 'మహిళాభివృద్ధి సొసైటీ' ఇప్పుడు 18 ఏళ్ళ మైలు రాయిని దాటింది. ఒక్కసారి గతం లోకి చూస్తే మనస్సులో ఎన్నో జ్ఞాపకాలు ఒక్కుమ్మడిగా మెదలుతాయి. ఆనందం,ఉద్వేగం, ఆలోచన ముప్పిరిగొంటాయి. కొన్ని నిరుత్సాహ కరమైన సంఘటనలు మనస్సులో గుచ్చుకునేవి వున్నా మొత్తంమీద నిర్దేశించుకున్న ఆశయ సాధనకోసం మహిళాభివృద్ధి సొసైటీ చేసిన, చేస్తున్న కృషి సత్ఫలితాలను యిస్తుండడం; ఎంచుకున్న రంగాలలో మేటి శిక్షణ, మార్గదర్శక, ఆదర్శ వ్యవస్థల నిర్మాణ సంస్థగా ఎదగగల గడం; లబ్ధిదారుల, భాగస్వాముల విశ్వాసాన్ని గణనీయంగా చూరగొన గలగడం, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో 'ఏపిమాస్' అంటే చెప్పుకోదగిన గుర్తింపు రావడం ఎంతైనా సంతృప్తికరమైన అంశాలు. ఆశయం అదే అయినా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మారుతున్న పరిస్థితులకు, ప్రాధాన్యాలకు అనుగుణంగా ఆ ఆశయ సాధనకు ఎప్పటికప్పుడు కొత్త మార్గాలను ఎంచుకోవడం, నూతన కార్యక్రమాలను చేపడుతుండడం మహిళాభి వృద్ధి సొసైటీ ప్రత్యేకత. గత అనుభవాలు, అవగాహనలు, పాతాల పునాదులపై సరికొత్త కార్యక్రమాలను చేపట్టి తన కార్యక్షేత్రాన్ని మహిళాభివృద్ధి సొసైటీ వైవిధ్యభరితంగా విస్తరించుకుంటూ వచ్చింది. తద్వారా ఎప్పటికప్పుడు కొత్తవారితో కలసి పనిచేసే అవకాశాలు,మరిన్ని రంగాలలో మరెందరికో నిర్వాహక, మార్గదర్శ కత్వ సేవలుచేసే అవకాశాలు పుష్కలంగా లభించడం ఒక విశేషం. 18 ఏళ్ళుగా ఇలా నిత్యనూతనంగా మహిళాభివృద్ధి సొసైటీని నిలపడంలో పలువురి కృషి, అనేకమంది వ్యక్తుల, సంస్థల సహకార భాగస్వామ్యాలు వున్నాయి. ఉత్సాహ, ప్రోత్సాహాలతో, అంకితభావంతో పనిచేసే సిబ్బంది, అనుకూలతలలో, ప్రతికూలత లలో కూడా సరైన సూచనలు, సలహాలు అందిస్తూ మార్గదర్శనం చేసే పాలకవర్గం, అండగా నిలిచి ముందడుగు వేయించే ఆర్థిక సహాయ, భాగస్వామ్య సంస్థలు, ప్రభుత్వాలు సూచనలను పాటిస్తూ, చక్కగా ఆచరిస్తూ మహిళాభివృద్ధి సొసైటీ కృషిని సఫలంచేసే లబ్ధిదారులు ఇలా ఎందరెందరికో ఈ విజయ ప్రస్థానంలో పాత్ర వున్నదనే విషయాన్ని మేము ఏనాడూ విస్మరించం. మాతో పాటు ఈ 18 ఏళ్ళ పండుగను ఆనందంగా ఆస్వాదిస్తూ మేము మరిన్ని విజయవంతమైన ముందడుగులు వేయాలని ఆకాంక్షించే వారందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటూ, వారి విశ్వాసాన్ని నిలబెట్టుకోవడానికి మరింత పూనికతో సర్వదా కృషి సాగిస్తామని విన్నవించుకుంటూ ...

జీవన వేదం

# కొత్త-పాత!

**'కొ**త్తొక వింత, పాతొక రోత' అనే సామెత తెలిసిందే. సృష్టిలో, ప్రకృతిలో అత్యంత సహజమైనది 'మార్పు' ! మనం గమనించవచ్చు, గమనించకపోవచ్చు కాని సంకల్పితంగానో, అసంకల్పితంగానో, నియంత్రితంగానో, అనియంత్రితంగానో; బహిర్గతంగానో, అంతర్గతం గానో మార్పు అనేది జరుగుతూనే వుంటుంది. అది జీవన సూత్రం! ఈ విషయాన్నే ప్రఖ్యాత తత్వవేత్త, భారత రెండవ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 'ఛేంజ్ ఈజ్ ద లా ఆఫ్ లైఫ్' అని సూత్రీకరించారు. 'లోకో భిన్నరుచి:' అని సంస్కృత లోకోక్తి. అంటే, సమాజం ఎన్నో అభిరుచుల సమూహం, ఎవరి ఇష్టం వారిదే అని అర్థం. కాని నిజానికి సమాజం సంగతి అటుంచితే, ప్రతి వ్యక్తిలో కూడా ఎన్నో ఎన్నెన్నో భిన్న భిన్న అభిరుచులుంటాయి. 'ఎప్పుడూ పాత చింతకాయ పచ్చడేనా?' అని ఈసడించుకునే స్థాయి నుంచి 'పండుగపూట కూడా పాత ....?' అనేంత స్థాయి వరకు ఈ వాంఛా వైవిధ్యం చెలరేగవచ్చు. ఇది ఇష్టా రాజ్యం, ఇక్కడ మంచీచెడుల కొలమానాలు వర్తించవు. కొత్త లో ఒక తెలియని ఆకర్షణ వుంటుంది. అది మూసిన గుప్పిడి. అందులో ఏముందోనన్న కుతూహలం, చూడాలన్న తహతహ మనసును తొలుస్తుంటాయి.'ఓల్డ్ ఈజ్ గోల్డ్' (అది పాతదైతేనేం, బంగారం కదా!) అనే ఆంగ్ల సూక్తి ఎంతగా నచ్చ జెప్పాలని చూసినా, మనసు కొత్తవింత వైపు లాగుతుంది. ఇక్కడకూడా మంచిచెడుల బేరీజులేమీ వుండవు. 'అతి పరిచయాత్ అవజ్ఞ' అంటే, ఎవరితోనైనా పరిచయం పెరిగేకొద్దీ మొదట్లోవున్న మర్యాద తగ్గి తేలికభావం ఏర్పడుతుందట. ఇవన్నీ కాలానుగుణంగా కలిగే పరిణామాలు. మంచికైనా, చెడుకైనా కాలాన్ని కట్టడి చేయాలంటే సామాన్యమైన కృషి సరిపోదు, మిన్నూ మన్నూ ఏకం చేయగలిగినంత దీక్ష, దక్షత వుంటేనే అది సాధ్యం. ఇక కొత్తదైనంత మాత్రాన అది తగనిదని అనుకోవడం అజ్ఞానమే. 'పాతది బంగారమేమో కాని, మెరిసేదంతా బంగారం కాదు' అని కూడా ఆలోచించాలి కదా! ఈ భావాన్నే కవికుల తిలకుడైన కాళిదాసు కూడా తన 'మాళవికాగ్ని మిత్రం'లో ప్రస్ఫుటీకరించాడు. ఆయన కావ్యపరంగా చెప్పినా అది అన్ని కాలాలకు, అన్నిటికీ వర్తించే విశ్వజనీన సత్యం! 'పాత మంచిదే కావచ్చు, కాని పాతదైన ప్రతిదీ మంచిది కాదుగా! కొత్తదాన్ని తక్కువచేసి చూడడం తగదు. బుద్ధిమంతులు పాతకొత్తలను పరిశీలించి మంచిని ఆదరిస్తారు. మూర్ఖులేమో గొర్రెదాటుగా ఇతరులు చెప్పిన దానికి తలాడిస్తారు' అంటాడు ఆ మహాకవి! ఏమైనా కొత్తకూడా పాతబడుతుందని మరిచిపోకూడదు సుమా!

*ఆసక్తికలిగినవారి కోసం ఆ శ్లోకం:*

**పురాణమిత్యేవ న సాధు సర్వం నచాపి కావ్యం నవమిత్యవద్యం**
**సంత: పరీక్ష్యాన్యతరత్ భజన్తే మూఢ: పర ప్రత్యయనేయ బుద్ధి:**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:T.Chandra Sekhar Reddy**

అయోమయంగా పరుగు పెట్టడం కంటె ఆత్మ విశ్వాసంతో ఒక్కో అడుగు వేసినా ఎంతో మేలే

## లోపలి పేజీలలో ....


- మూలాలను విస్మరించే పెరుగుదల.... ...05
- గర్భవతులు, బాలింతల ఆహారం తీరు పరిశీలన ...07
- వినూత్న కార్యక్రమాలకు చిరునామాగా 'మాస్ ' ...08
- అనంత 'పల్లె జీవం'లో 'మాస్' పురోగతి ! ...10
- అభివృద్ధి పథంలో ఆదర్శగ్రామం బోర్పట్ల ! ...12
- రైతు ఉత్పత్తిదారుల సంస్థల నిర్మాణం, ప్రగతి ..15
- ఆహార వైవిధ్యంపై మూధనమ్మకాల ప్రభావం! ...19
- గర్భిణిలో మార్పు తెచ్చిన 'మాస్' ! ...21
- రైతులకు ఎఫ్ పి ఓ లు అందించే సేవలు ! ...22
- ఎఫ్ పి ఓ సేవలపై ముమ్మరంగా ప్రచారం ! ...23
- సమీకృత వ్యవసాయంతో జి4 ప్రాజెక్ట్ పురోగతి! ...24
- అభివృద్ధి పథంలో పీలేరు రైతు సేవా కేంద్రం! ...26
- ఎఫ్ పి ఓ ల ఏ జి ఎం నిర్వహణ ప్రక్రియ ! ...28
- ఎఫ్ పి ఓ సత్తా చాటిన క్షేత్ర దినోత్సవం ! ...30
- బోర్డోపేస్ట్ కవచంతో మొక్క మొదళ్ళకు రక్షణ ...32
- రైతు సేవా కేంద్రం అందించే సేవలు ! ...33
- సైలేజ్ తయారీతో కరువుపై గెలుపు ! ...34



ఎడిటర్ : టి. చంద్రశేఖర రెడ్డి

అసోసియేట్ ఎడిటర్: జె.వి. క్రిష్ణమూర్తి

ఎడిటోరియల్ కమిటి:

ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి,

ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్

ఎన్. రమాదేవి

కన్సల్టెంట్ కె.రఘురామరాజు



గమనిక: 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.



**మహిళా సాధికారత**

ఏపిమాస్ కార్యాలయం,

ప్లాట్ నెం.11-12, హుడా కాలని,

తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర,

మణికొండ, రంగారెడ్డి జిల్లా,

హైదరాబాదు-500089

ఫోన్స్ : 08413-403118/19/20

ఫాక్స్ : 08413-403117

Web:www.apmas.org

E Mail: info@apmas.org


### మహిళా సాధికారత ప్రోత్సాహక చందా

| ఏడాదికి | రెండేళ్ళకు | మూడేళ్ళకు |
|---|---|---|
| రూ.110 | రూ.200 | రూ.280 |

### ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం): | రూ. 25,000 |
| మల్టీకలర్ బ్యాక్ పేజి (పూర్తి): | రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి): | రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి): | రూ. 10,000 |

- చందాలు లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులను, డిడిలను 'ఏపిమాస్-హైదరాబాద్' పేరుమీద మాత్రమే పంపాలి

కలను కళ్ళలో దాచుకుంటే కరిగి కన్నీరవుతుంది, గుండెలో పొదువుకుంటే నెరవేర్చుకునే ప్రేరణ ఇస్తుంది

# మూలాలను విస్మరించే పెరుగుదల సమంజసమేనా?

## ఒక పరిస్థితికి చూపిన పరిష్కారం అన్ని సమస్యలకు తారకమంత్ర మవుతుందా?

**– జె వి క్రిష్ణమూర్తి**

ఒక ప్రత్యేక పరిస్థితిలో ఒక నిర్దిష్టమైన సమస్యను అధిగమించడానికి చేసిన ప్రయోగం ఘన విజయాన్ని సాధించింది కదా అని, అన్ని పరిస్థితులలో, అన్ని ప్రాంతాలలో అదే ప్రయోగం విజయవంతం అవుతుందనుకోవడం వివేకం అనిపించుకుంటుందా? కొందరి పెట్టుబడితో ఆ కొందరి మేలుకే ఉద్దేశించిన వ్యవస్థను విస్తృతపరచి, ఆ పెరుగుదల మూలంగా వచ్చే ఫలాలను ఇతరులు అనుభవించడం సబబేనా? ప్రముఖ అభివృద్ధిరంగ ఆర్థికవేత్త ప్రొఫెసర్ శ్రీరాం వెలిబుచ్చిన సందేహాలివి.




'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) జులై 1వ తేదీన నిర్వహించిన 'స్మరజిత్ రే స్మారకోపన్యాసం' లో 'అభివృద్ధిని అందించడం: సాంప్రదాయిక ప్రయోగాల విస్తరణను ప్రామాణీకరించడం' అనే అంశంపై తాను చేసిన ప్రధాన ప్రసంగంలో ఆయన ఈ సందేహాలను వెలిబుచ్చారు. ఇటువంటి విస్తరణ వల్ల సంస్థ బలపడుతుందని, అధిక లాభాలు వస్తాయని, వాటాదార్లకు, ఇతరులకు మంచి ఆదాయం సమకూరుతుందని కొందరు ఇటువంటి చర్యలను సమర్థించినా ఏ కొందరికో, ఏ ప్రాంతానికో పరిమితంగా చేపట్టే నిర్దిష్ట ప్రయోగాలను ఆ ప్రత్యేక లక్షణంతో నిమిత్తం లేకుండా అందరికి, అన్ని చోట్లకు వర్తింపజేయడం సహకార వ్యవస్థ మూలసూత్రాలను అవహేళనచేయడం కాదా అని ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ లోని 'మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ – తెలంగాణా' (ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి) తోడ్పాటుతో, ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి ప్రాంగణంలో నిర్వహించారు.

తన సందేహాలను వివరించడానికి ఆయన మూడు ఉదాహరణలను పేర్కొన్నారు. మొదటిది: అమూల్ పాడి పరిశ్రమ సహకారసంస్థ, రెండవది: స్వయంసహాయ సంఘాల (ఎస్ హెచ్ జి ల) వ్యవస్థ, మూడవది: సమాచార హక్కు చట్టం (ఆర్ టి ఐ). మొదటి రెండూ వ్యవస్థాపక సూత్రాలకు భిన్నంగా విస్తరించినవి కాగా మూడవది నియమాలకు అనుగుణంగా పనిచేస్తూ తన విశ్వరూపాన్ని ప్రదర్శిస్తున్నది.

**అమూల్ కథ !**

గుజరాత్‌లోని ఆనంద్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న అమూల్ సహకార సంస్థ మొదట గుజరాత్ లోని ఆరు స్థానిక పాడిపరిశ్రమ సహకార సంస్థల సభ్యులు ఎదుర్కొన్న సమస్యకు పరిష్కారంగా ఆ ఆరు సంస్థల సభ్యులు సంఘటితమై వారి పెట్టుబడి మూలధనంగా ఏర్పాటైంది. (1) పాల సేకరణ (2) పాల నిల్వ, ప్రాసెసింగ్, ఉప ఉత్పత్తుల తయారీ (3) మార్కెటింగ్ అనే మూడు అంచెల వ్యవస్థగా అమూల్ పనిచేసేది. అమూల్ ఏర్పాటు మూల పురుషులలో ఒకరు,తన అద్భుత నిర్వహణతో దానిని ఉన్నత విజయ శిఖరాలకు చేర్చిన శ్రీ కురియన్‌ను 2005లో ఆ సంస్థ నుంచి సాగనంపడం ఒక విషాద పరిణామం. అందుకు బోర్డు పెద్దలు చెప్పిన కారణం గత కొన్ని సంవత్సరాలుగా

నిన్ను గుడ్డిగా నమ్మేవారికి, వారి నమ్మకం గుడ్డిదని నిరూపించడం తెలివైన పనేనా ?







వ్యాపార స్థాయి, లాభాలు పెరగడం లేదని. నిజానికి అప్పటికే గుజరాత్‌లోని వివిధ పాడిపరిశ్రమ సహకార సంస్థలు అన్నీ అమూల్ గొడుగు కిందికి చేరాయి.

గుజరాత్ రాష్ట్ర వ్యాప్తంగా పాలసేకరణ పూర్తి స్థాయికి చేరింది. ఏటా 200 కోట్ల రూపాయలకుపైగా అమ్మకాలు సాగుతున్నాయి. అయితే, అమూల్ కొనుగోళ్ళు, విక్రయాలను దేశమంతటికీ విస్తరించి వ్యాపారాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవాలని కొత్తబోర్డు ఆశించింది. సహకార మూల సూత్రాలకు అది భిన్నమని కురియన్ ఒప్పుకోలేదు. కాని తదనంతరం విస్తరణవల్ల ఏటికేడాది వ్యాపారం విపరీతంగా పెరిగింది. 2019 నాటికి 33150 కోట్లు టర్నోవర్ సాధించింది అమూల్. ఈ పరిణామాన్ని విజయగాథగా ఒప్పుకోవాలా, మూల సూత్రాలను విస్మరించినందుకు విమర్శించాలా అనేది అంత సులువుగా సమాధానంచెప్పలేని ప్రశ్న అని శ్రీ శ్రీరాం అన్నారు.

ఇంతే కాకుండా అమూల్ విజయాన్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుని స్థానిక పరిస్థితులు,అవకాశాలు అనుగుణంగా వున్నాయోలేదో పరిశీలించకుండా అమూల్ ప్రయోగాన్ని అన్ని చోట్లకు విస్తరించాలనుకుంటే అది సరైన ఆలోచన అవుతుందా అనికూడా ఆయన ప్రశ్నించారు.

**ఎస్ హెచ్ జి ల ప్రస్థానం**

మనదేశంలో స్వయంసహాయ సంఘాల ఉద్యమం సాగిన తీరుకూడా అమూల్ కథనే తలపిస్తుందని శ్రీ శ్రీరామ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో స్వయంసహాయ ఉద్యమాన్ని ముందుగా ఆరి జిల్లాలలో ప్రయోగాత్మకంగా అమలు జరిపినపుడు స్వయం సహాయం అనే మూలసూత్రం బలీయంగా పని చేసిందని, మహిళా సంఘాలు తమ నెలవారీ కొద్దిపాటి పొదుపుతో చెప్పుకోదగిన మొత్తాన్ని జమ చేసుకుని జీవనోపాధుల పెంపుదలకు ఉపయోగించుకున్నారని, అయితే, ప్రయోగం స్థాయిలో చక్కగా సాగిన ఆ ఉద్యమం పూర్తి కార్యక్రమంగా ఎదిగి, విస్తరించి, ప్రభుత్వ జోక్యం పెరిగి, వారి పొదుపుకు అదనంగా ప్రోత్సాహక నిధి ఇవ్వడం, పావులా వడ్డీకి రుణాం ఇవ్వడంతో స్వయంసహాయం లోపించి అసలు ఉద్యమం పక్కదారి, పెడదారి పట్టిందని శ్రీరామ్ విశ్లేషించారు.

తమ పొదుపుతో తమ జీవనోపాధులను మెరుగుపరచు కోవలసిన స్వయంసహాయ మహిళలు పావలా వడ్డీకి సంఘంలో అప్పుతీసుకుని, బయట రెండురూపాయల వడ్డీకి అప్పుఇచ్చే వడ్డీ వ్యాపారులుగా మారడం, వనరులు పెంచు కోవడం కాక పంచుకోవడం స్వయంసహాయం వెర్రితలలు వేసిందనడానికి ఒక చక్కని ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు. స్వయంసహాయ మహిళలు సాధికారత సాధించారు, చక్కగా మాట్లాడగలుగుతున్నారు మొదలైన ఎన్ని సమర్ధనలు చేసినా ఆశించిన ఆశయాలను తుంగలోతొక్కడం ఎంతవరకు సబబు అన్నది ఆయన ప్రశ్న.

**ఆర్ టి ఐ విజయం**

సమాచార క్కు చట్టం ఈ రెండు ప్రయోగాలకు భిన్న మైనదని, రాజస్థాన్ గ్రామీణ ప్రాంతంలో మొదలైన ఉద్యమం ప్రభుత్వం చట్టం చేయవలసిన స్థాయికి చేరి, నిబంధనల ప్రాతిపదికగా ఏర్పాటై ఏ ప్రభుత్వం ఆ చట్టం

(మిగతా 14వ పేజీలో)

సమస్యను చూసి భయపడితే అది రెట్టింపు భయపెడుతుంది, పట్టించుకోకపోతే పలాయనమవుతుంది

# గర్భవతులు, బాలింతల ఆహారం తీరు పరిశీలన !

– డి. నాగలక్ష్మి

మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) చేపట్టిన 'మార్పు' (ఎంఎఆర్‌పియు) పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలు మెరుగైన, వైవిధ్యమైన ఆహారాన్ని తీసుకోవడంలో తాము లింగపరంగా ఎటువంటి అడ్డంకులను ఎదుర్కొంటున్నారో, బలవర్ధకమైన పోషకాహారాన్ని తీసుకోవలసిన ఆవశ్యకత ఏమిటో, లింగపరమైన అవరోధాలను అధిగమించి పోషకాహారాన్ని సక్రమంగా ఎలా తీసుకోవాలో వారికి వివరించి, గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కలిగించడం జరుగుతున్నది.





గర్భిణులు, బాలింతల మెరుగైన పోషణ కోసం తీసుకోవలసిన వైవిధ్యంతో కూడిన 10 రకాల ఆహార పదార్థాలను గురించి వారికి తెలియజేస్తూ ఈ పది రకాలలో ప్రతిరోజూ కనీసం 7 రకాలను తీసుకోవలసిన అవసరాన్ని వారికి వివరిస్తూ, నిజానికి సాధారణంగా మనం ప్రతిరోజు ఎన్ని రకాల వైవిధ్యమైన ఆహార పదార్థాలను తింటున్నామో, ఎంత పరిమాణంలో తింటున్నామో, ఎన్ని గంటల వ్యవధిలో తింటున్నామో వారి అనుభవాలద్వారానే వారికి తెలియజేయాలని అనుకోవడం జరిగింది. ఇందులో లింగ పరమైన ఆటంకాలు ఏమైనా ఉన్నాయా అనేది తెలుసు కుంటూ, లోపాలను సవరించుకునేలా తగిన కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పించాలనే ఉద్దేశం తో 7 రోజుల్లో 24 గంటలపాటు గర్భిణులు, బాలింతలు తీసుకున్న ఆహారం తీరుతెన్నుల గురించి ఒక పరిశీలన చేయడం జరిగింది .

ఈ పరిశీలన ఫలితంగా గర్భిణులు, బాలింతలు ఎవరు ఎలాంటి ఆహార పదార్థాలు తింటున్నారో, ఏ రకమైన వైవిధ్యభరిత ఆహారపదార్థాలను తినలేకపోతున్నారో ప్రత్యక్షంగా తెలుసుకోవడం జరిగింది. దీనితోపాటు గర్భిణుల, బాలింతల ఆహారపు అలవాట్లలో, ఇతర ఆరోగ్య విషయాలలో వారి ప్రవర్తనలో మార్పు వచ్చేలా కొన్ని అవగాహన కార్యక్రమాలను (కౌన్సెలింగ్) నిర్వహించి క్రమం తప్పకుండా, సకాలంలో, వైవిధ్యమైన కనీసం ఏడు రకాల ఆహారాలను ప్రతిరోజూ తినాలని సూచించడం జరిగింది. ఇందులో భాగంగా 'ఫల దినోత్సవం' (ఫ్రూట్స్ డే) నిర్వహించి మార్పు ప్రేరకుల (ఛేంజ్ ఏజెంట్స్), సమాఖ్య సభ్యుల సహకారంతో స్థానికంగా, కాలానుగుణంగా లభించే పండ్లను అందించి, ప్రతిరోజూ పండ్లు తినాలని వివరించాము.

ఈ అవగాహన కార్యక్రమాల ఫలితంగా తాము తీసుకోవలసిన ఆహార వైవిధ్యంపై వారు తగిన అవగాహన పెంచుకున్నారు, ఇకనుంచి ప్రతిరోజూ పండ్లు , వైవిధ్యమైన ఆహార పదార్థాలను తింటామని వారు తెలిపారు.

■

మహా సంపద కంటె ఒక చిన్ని మంచి ఆలోచన, కొద్దిపాటి కారుణ్యం చాలా విలువైనవి

# వినూత్న కార్యక్రమాలకు చిరునామాగా ' మాస్ ' !

## 18 వసంతాలు పూర్తిచేసుకున్న 'మహిళాభివృద్ధి సొసైటీ'

- జె వి క్రిష్ణమూర్తి

**ల**క్ష్యం ఒకటే అయినా, ఆ లక్ష్య సాధనకు ఎంచుకునే మార్గాలు అనేకం కావచ్చు. దీర్ఘ అస్వస్థతతో వున్న వ్యక్తికి పూర్తి స్వస్థత చేకూర్చుడానికి వైద్యులు అనేక రకాలుగా ప్రయత్నించవలసి రావచ్చు. ఆ వ్యక్తి రక్తపు పోటును క్రమబద్ధం చేయడం, మధుమేహాన్ని అదుపుచేయడం, జీర్ణక్రియను సరిదిద్దడం, ఇన్‌ఫెక్షన్లు సోకకుండా జాగ్రత్తపడడం, మానసిక ఆరోగ్యాన్ని చక్కదిద్దడం, నివసించే వాతావరణంలో అనువైన మార్పులు తేవడం, చికిత్సకు సానుకూలంగా స్పందించే చైతన్యాన్ని తీసుకురావడం ... ఇలా అనేక వైద్యప్రక్రియలను ఒకటివిడిచి ఒకటి చేయడం, చేసినదే మళ్ళీ మళ్ళీ చేయడం అవసరం కావచ్చు.

విజన్, మిషన్ అనే మాటలు అందరికీ అర్థమైనా కాకున్నా 'ఏపిమాస్' గా, 'మాస్ ' గా సుపరిచితమైన 'మహిళాభివృద్ధి సొసైటీ' ప్రధాన ఆశయం, అంతిమ గమ్యం పేదరిక నిర్మూలనమే. అనుసరించడానికి ఎంపికచేసుకున్న మార్గం సమాజంలో అభివృద్ధికి దూరమైన మహిళలను, పేదలను అవగాహన పరంగా, ఆర్థికంగా, విద్యా వైద్య సౌకర్యాల లోటును తొలగించడం ద్వారా, నైపుణ్యాల రీత్యా, జీవనో పాధుల సక్రమ నిర్వహణతో, నూతన జీవనోపాధులను చేపట్టేలా ప్రోత్సహించడంతో బలోపేతం చేసి , వారు పేదరికం నుంచి బయటపడి అభివృద్ధిచెందిన సమాజంలో తగిన ప్రాతినిధ్యం కలిగిన భాగస్వాములుగా ఎదిగేలా చేయడమే.

**ఎస్ హెచ్ జి లతో మమేకమై ...**

2001 జూన్‌లో ఆవిర్భవించి, సమాజ సేవలో ఇప్పటికి 18 వసంతాలు పూర్తిచేసుకున్న 'మహిళాభివృద్ధి సొసైటీ' చేస్తున్నదిదే! ప్రారంభంలో దాదాపు పదేళ్ళకు పైగా మహిళా స్వయంసహాయ సంఘాలను (ఎస్ హెచ్ జి లను), సమాఖ్యలను నిర్మాణ పరంగా, సమర్థమైన నిర్వహణ పరంగా, సుస్థిరాభివృద్ధి సాధన దిశగా బలోపేతంచేసి రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయంగా కూడా ఎస్ హెచ్ జి లు అనే మాట వినపడగానే 'ఏపిమాస్' అనే పదం గుర్తొచ్చేలా చేసింది. శిక్షణలు, స్ఫూర్తిదాయక వ్యవస్థల సందర్శనలు, బ్యాంకులతో అనుసంధానాలు, రుణాల సద్వినియోగంపై అవగాహన కలిగించడం, సభ్యులకు, నాయకురాళ్ళకు, కార్యవర్గాలకు ఉత్తమ నిర్వహణలో మార్గదర్శకత్వం, దైనందిన కార్యక్రమాల నిర్వహణలో తోడు నీడగా నిలచి చేయూతనివ్వడం ... ఇలా స్వయంసహాయ వ్యవస్థతో మమేకమై మహిళాభివృద్ధి సొసైటీ సాగించిన కృషి స్వయంసహాయ రంగంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే తలమానికంగా నిలబెట్టడమే కాకుండా, ఇతర రాష్ట్రాలకు అధ్యయన కేంద్రంగా కూడా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టింది.

సదవగాహనకు, నాణ్యతకు, జవాబుదారీతనానికి, పారదర్శకత్వానికి, సుస్థరాభివృద్ధికి ఏపిమాస్ అనుసరించిన విధానాలే ఇందుకు మూలం!

**జీవనోపాధులపై చైతన్యం ...**

స్వయంసహాయ వ్యవస్థ బలోపేతంలో భాగంగానే ఎస్ హెచ్ జి మహిళలు తాము తీసుకున్న రుణాలను, పొదుపు మొత్తాలను కేవలం ఇంటి అవసరాలకు వాడుకొని రుణాలు తిరిగి చెల్లించలేక, ఎదుగూబొదుగూలేని జీవితం గడపడం కాకుండా ఆ సొమ్మును తమ కుటుంబాల ఆదాయాన్ని పెంచు కునే సాధనంలా ఉపయోగించుకునే చైతన్యం, అవగాహన కలిగించే కార్యక్రమాన్ని ఏపిమాస్ చేపట్టింది. స్వయంసహాయ మహిళలు తాము అప్పటికే ఏదైనా జీవనోపాధి చేపట్టివుంటే దానిని చక్కదిద్దుకోవడం ద్వారా, కొత్త జీవనోపాధులను చేపట్టడంద్వారా మరింత ఆదాయం పొందేలా ఎన్నో అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. ప్రభుత్వాలు కూడా మహిళా స్వయంసహాయ సంఘాలకు అనేక గ్రామీణ కార్య క్రమాల నిర్వహణ బాధ్యతను అప్పగిస్తున్నాయంటే దీని వెనుక

చిక్కుల్లో చిరునవ్వేవాడు, విపత్తునుంచి బలం పెంచుకునేవాడు, వెలుగులో సాహసించేవాడే మహాబలుడు

ఏపిమాస్ కృషి ఎంతైనా వుంది.

**వాటర్‌షెడ్ కార్యక్రమాలు**

ఆ తర్వాత కేంద్రప్రభుత్వ భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టే వాటర్ షెడ్ కార్యక్రమాలద్వారా పర్యావరణ పరిరక్షణకు, గ్రామాలలో ప్రాథమిక వనరుల కల్పనకు, పేదల ఆదాయం పెంపుదలకు గ్రామీణులలో, రైతులలో తగిన అవగాహన కలిగించే బాధ్యతను ఏపిమాస్ చేపట్టి, కేవలం ఆదర్శ వ్యవస్థ నిర్మాణంపై అవగాహన కలిగించడమే కాకుండా ఆదర్శవంతమైన వ్యవస్థలను ఎలా నిర్మించవచ్చునో ఆచరణాత్మకంగా నరూపించడంకోసం కొన్ని వాటర్‌షెడ్‌ల నిర్వహణను ఏపిమాస్ స్వయంగా చేపట్టింది, సమర్ధంగా నిర్వహించి, సమాజపరం చేసింది.

**ఆదర్శ గ్రామాలు**

స్వయంగా ఆదర్శ వ్యవస్థలను నిర్మించే కార్యక్రమాలను చేపట్టిన మాస్ ఇందుకు కొనసాగింపుగా ఆదర్శ గ్రామాల నిర్మాణ కార్యక్రమాలను కూడా భాగస్వామ్య సంస్థల తోడ్పాటుతో చేపట్టింది. ప్రాథమిక విద్య, మహిళా శిశు ఆరోగ్యం, వైద్యసేవలు, గ్రామాలలో ఇంటింట మరుగుదొడ్ల నిర్మాణంపై చైతన్యం తీసుకురావడం, యువతకు ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగించడం, నైపుణ్యాలను పెంపొందించడం, గ్రామ అభివృద్ధి సంఘాలను ఏర్పాటుచేసి సురక్షిత జలాలు, ఎల్ ఇ డి వీధిదీపాలు, గ్రామాలలో రోడ్ల నిర్మాణం, పాఠశాలలకు వసతుల కల్పన వంటి కార్య క్రమాలను ఆ సంఘాలు చేపట్టేలా చూడడం వంటి కార్యక్రమాలను మాస్ నిర్వహిస్తున్నది.

**రైతు సంఘాలు, ఎఫ్ పి ఓ లు**

వాటర్‌షెడ్ కార్యక్రమాలకు కొనసాగింపుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో కొన్ని ఎంపిక చేసిన మండలాలు, గ్రామాలలో రైతులను ముఖ్యంగా సన్నకారు, పేద రైతులను, మహిళా రైతులను సంఘటితంచేసి రైతు సంఘాలను ఆపై వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాలను ఏర్పాటుచేసి తక్కువ పెట్టుబడితో, చీడపీడలకు లోనుకాకుండా అధిక దిగుబడి సాధించే ప్రకృతి వ్యవసాయ విధానాలపైన, ఉత్పత్తుల మార్కెటింగ్, ఉప ఉత్పత్తుల తయారీ మొదలైన అంశాలపై శిక్షణలు, అవగాహనలు కలిగించే కార్యక్రమాల నిర్వహణను మహిళాభివృద్ధి సొసైటీ ప్రస్తుత ముఖ్య కార్యక్రమంగా చేపట్టింది. దీనిలో భాగంగా రైతు సేవా కేంద్రాలు, హరిత నవీకరణ కేంద్రాల ఏర్పాటు, భాగస్వామ్య సంస్థల తోడ్పాటుతో రైతులకు తక్కువ ధరకు వ్యవసాయ పరికరాలను అద్దెకు ఇచ్చే సదుపాయాలను మాస్ కల్పిస్తున్నది.

ఇంకా ఏ పి డి ఎం పి (కరువు నివారణ పథకం), స్టార్టప్ విలేజ్ ఆంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం, జి4 ప్రాజెక్ట్, రైతు సేవా కేంద్రం, క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రోగ్రాం వంటి అనేక కార్యక్రమాలను మాస్ నిర్వహిస్తున్నది.

**దేశ విదేశాలలో ...**

నేరుగా స్వయంగా లేదా భాగస్వాముల ద్వారా మనదేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాలలో ఏపిమాస్ ఏదో ఒకరూపంలో సేవలందించింది. అంతర్జాతీయంగా గతంలో బంగ్లాదేశ్, కెనడా, జర్మనీ, కెన్యా, థాయ్‌లాండ్, యు కె, వియత్నాం దేశాలలో వివిధ రకాల సేవలందించిన ఏపిమాస్ తాజాగా ఇథియోపియా, మయన్మార్ దేశాలలో కొన్ని ప్రాజెక్ట్‌లను నిర్వహిస్తున్నది.

**గుర్తింపు, అవార్డులు**

అంకితభావంతో, పారదర్శకంగా ,ఎంతో నాణ్యమైన కార్యక్రమాలను అందించిన, అందిస్తున్న మాస్ బహుముఖ విశిష్ట సేవలకు ఎంతో గుర్తింపు, ఎన్నో ప్రశంసలు, అవార్డులు లభించాయి. భాగస్వామ్య సంస్థల విస్వాసాన్ని ఎంతగానో చూరగొని నిత్య నూతనత్వంతో మహిళాభివృద్ధి సొసైటీ మరిన్ని విశిష్ట సేవలతో ముందుకు సాగుతున్నది.వేలాదిగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి , లక్షలాదిమందికి శిక్షణలు యిచ్చి, వందలాదిమందిని సుశిక్షకులుగా తయారుచేసిన మహిళాభివృద్ధి సొసైటీ తన ప్రగాఢ ఆశయాలైన పేదరిక నిర్మూలన, లైంగిక సమానత్వ సాధనలో మరెన్నో ముందడుగులు వేయగలుగుతుందని ఆశిద్దాం.

'మాస్' ను గురించిన మరికొన్ని విశేషాలు 20 , 25 పేజీలలో ...

■

మాటలతో, చేతలతో నొప్పించే వారికంటె, ఆత్మీయుల అనాదరణ మరింత బాధాకరం

# అనంత 'పల్లె జీవం'లో 'మాస్' పురోగతి !

– జి. అమరేంద్రుడు

**క**రువు ప్రాంతాలలోని రైతులకు వివిధ రకాలుగా తోడ్పాటు అందించి, ఆ రైతు కుటుంబాలపై కరువు ప్రభావాన్ని తగ్గించడం, ఆ కుటుంబాల జీవన భద్రత పెంచడం అనేవి 'పల్లెజీవం' ప్రాజెక్ట్ ప్రధాన ఆశయాలు.

ఈ ప్రాజెక్టు పరిధిలోని చిన్న, సన్నకారు రైతులు రైతు బడుల (ఎఫ్ఎఫ్ఎస్) ద్వారా కరువును తట్టుకొనే వ్యవసాయ పద్దతులను నేర్చుకొని ఆచరించడం, రైతు సేవా కేంద్రాల (సిహెచ్‌సి) ద్వారా సరసమైన బాడుగ రేటుకు వ్యవసాయ యంత్రాలను పొందడం, జీవ వనరుల కేంద్రం (బిఆర్‌సి) ద్వారా కషాయాలను స్థానికంగా పొందడం, వాతావరణ, జీవనోపాధుల సమాచార కేంద్రాల (సిఎల్ఐసి) ద్వారా వ్యవసాయ సమాచారాన్ని తెలుసుకోవడం, విత్తనాలు ఇతర వ్యవసాయ పెట్టుబడులను పొంది వ్యవసాయంలో ఖర్చులు తగ్గించుకొని, కరువు పరిస్థితిలో కూడా మంచి దిగుబడి సాధించి ఆహార భద్రత, జీవన భద్రత పొందేలా చేయడం పల్లెజీవం ప్రాజెక్ట్ ప్రత్యేకత.

మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) పర్యవేక్షణ, నిర్వహణ లో అనంతపురం జిల్లాలోని 12 మండలాలలో పల్లె జీవం ప్రాజెక్ట్‌లో అమలుచేసిన వివిధ కార్యక్రమాల ప్రగతిని పరిశీలిద్దాం:

**1. రైతు బడుల (ఎఫ్ఎఫ్ఎస్) నిర్వహణ**

వర్షపాత సంవత్సరంలో ప్రతి 15 రోజులకు ఒక రైతు బడి నిర్వహించి కరువును తట్టుకునే వ్యవసాయ విధానాలు, నైపుణ్యాల పైన రైతులకు క్షుణ్ణమైన అవగాహన కలిగించడం, నేర్చుకున్న విధానాలను ఆచరించేలా చూడడం రైతుబడుల ముఖ్య ఉద్దేశం.

- 2018-19 ఖరీఫ్, రబీ సీజన్లలో 12 మండలాలకు గాను ప్రతి మండలంలో 16 రైతు బడుల (ఎఫ్ఎఫ్ఎస్) నిర్వహణ
- ప్రతి మండలంలోని ఒక పంచాయతీలో 30 మంది రైతుల (20 మగ + 10 ఆడ) వంతున మొత్తం 12 మండలాలలో 360 మంది రైతులకు కరువు సంసిద్ధత కార్యక్రమాలపైన శిక్షణ ఇవ్వడం జరిగింది.
- ఖరీఫ్, రబీ క్షేత్ర దినోత్సవాల ద్వారా 2,755 మంది రైతులకు కరువును తట్టుకొనే వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించడం జరిగింది.



*క్షేత్ర దినోత్సవం*

**2. వాతావరణ, జీవనోపాధుల సమాచార కేంద్రాలు (సిఎల్ఐసి)**

రైతులకు స్థానికంగా వ్యవసాయ వాతావరణ సమాచారం అందించి సకాలంలో సరైన పంటలతో, అనువైన వ్యవసాయ పద్ధతులతో చక్కని సాగు సాగించేలా చూడడం, ఆ ప్రాంత రైతుల ఉమ్మడి అవసరంకోసం భారీగా విత్తనాలు, ఇతర వ్యవసాయ పెట్టుబడులను కొని, బహిరంగ మార్కెట్ కంటె తక్కువ ధరకు రైతుకు లభించేలా చూడడం ద్వారా రైతుకు వ్యవసాయ పెట్టుబడి ఖర్చు తగ్గించడం, సమయం ఆదా అయ్యేలా చూడడం ఈ సమాచార కేంద్రాల ముఖ్య ఉద్దేశం.

12 మండలాలలో మూడు పంచాయతీ గ్రామాలకు ఒకటి చొప్పున వాతావరణ, జీవనోపాధుల సమాచార కేంద్రాలను (క్లిక్ సెంటర్స్) ఏర్పాటు చేసి, ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించడం జరిగింది.

**3. జీవ వనరుల (బిఆర్‌సి) కేంద్రాల ఏర్పాటు :**

ప్రకృతిలో లభించే వనరుల తోనే పురుగుల, తెగుళ్ళ నియంత్రణకు, భూసార యాజమాన్యానికి వీలుగా స్థానిక క్లిక్ సెంటర్లలో జీవ వనరులను, కాషాయాలను రైతులకు అందుబాటులో వుంచి రైతులు వాటిని వినియోగించుకునేలా చూడడం ఈ కేంద్రాల ఏర్పాటు లక్ష్యం.

12 మండలాలలో జీవ వనరులను తయారు చేసే స్వచ్ఛంద (ఔత్సాహిక) కార్యకర్తల ఎంపిక జరిగింది.

- 9మంది ఔత్సాహికులకు జీవ వనరుల తయారీలో కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా శిక్షణ ఇవ్వడం జరిగింది.
- మూడు మండలాలలో జీవ వనరుల కషాయాల తయారీ, అమ్మకం ప్రారంభమైంది.

**రైతు సేవా కేంద్రాలు (కస్టమ్ హైరింగ్ సెంటర్స్-సిహెచ్‌సి)**

ఈ రైతు సేవా కేంద్రాల (సిహెచ్‌సి)లో ముఖ్యమైన వ్యవసాయ యంత్రాలను,పరికరాలను అందుబాటులో వుంచి ఎఫ్‌పిఓ సభ్యులకు తక్కువ బాడుగకు అందిస్తారు. వ్యవసాయ యంత్రాల ఖరీదులో ఎఫ్‌ఓలు కేవలం 15% భరిస్తే చాలు, మిగతా 85% రాయితీ లభిస్తుంది.

ఈ 12 మండలాలలో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటై, సేవలు అందిస్తున్నాయి.



ట్రాక్టర్ అందజేస్తున్న జిల్లా ప్రాజెక్ట్ అధికారి

**జీవ నేల అభివృద్ధి**

మాస్ ప్రాజెక్టు పరిధిలోని 12 మండలాలలో ప్రతి



జీవ నేలలో గొర్రెల మంద

పంచాయతీలో 125 ఎకరాల మెట్ట నేలను సారవంతమైన నేలగా అభివృద్ధి చేయడం ద్వారా తక్కువ వర్షపాతంలో కూడా భూమి తేమను నిల్వ వుంచుకొని మంచి వ్యవసాయ దిగుబడి సాధించేలా చూడడం ఈ పథకం లక్ష్యం.

**అమలు చేసే కార్యక్రమాలు**

1. భూమిలో తేమను పట్టి వుంచే కార్యక్రమాలు : కాంటూర్ కందకాల ఏర్పాటు, వ్యవసాయ కుంటలు (ఫామ్ పాండ్స్), రక్షక నీటి తడులు
2. భూమిలో సేంద్రియ పదార్థం పెంచే కార్యక్రమాలు : పొలంలో గొర్రెల మందను వుంచడం, చెరువు మట్టి తోలడం, నవధాన్య పంటల పద్ధతి, కంపోస్ట్ గుంతలు, ఎరువు తయారీ, వాడకం
3. భూమిని కుళ్ళించే, మేలు చేసే జీవరాశులను పెంచడం: ఘన, ద్రవ జీవామృతం వేయడం, రైజోబియమ్, ఫాస్పరస్ బాక్టీరియా వాడకం
4. చెట్లను పెంచడం : కంపోస్ట్ ఉపయోగం, ఆర్థికంగా తోడ్పడే చెట్లను పెంచడం, ఉదా : కానుగ, వేప, అల్లనేరేడు, మామిడి, పనస, టీక్

12 మండలాల్లో 48 ప్రతి పాదనలు రైతుల భాగస్వామ్యంతో తయారు చేసి, వాటిలో 33 ప్రతిపాదనలను జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్‌కు ఆమోదం కోసం పంపడం జరిగింది.

ఈ విధంగా అనంతపురం జిల్లాలో భాగస్వామ్య సంస్థలతో కలసి 'మహిళాభివృద్ధి సొసైటీ' నిర్వహిస్తున్న, పర్యవేక్షిస్తున్న 12 మండలాల్లో 'పల్లె జీవం'కరువు సంసిద్ధత పథకం అమలు ఆశావహంగా జరుగుతున్నది. ■

**నవ్వించినా, ఏడ్పించినా గత స్మృతులు మనసును ఉత్తేజ పరుస్తూనే వుంటాయి**

# అభివృద్ధి పథంలో ఆదర్శగ్రామం బోర్పట్ల !

– కనకం రాజ్‌కుమార్

**2016** వ సంవత్సరంలో బోర్పట్ల గ్రామాన్ని మహిళాభి వృద్ధి సొసైటీ (మాస్) దత్తత తీసుకొని 'అరబిందో' సంస్థ సహకారంతో ఆ గ్రామ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నది. ఈ అభివృద్ధిలో భాగంగా గత సంవత్సరంలో (2018–19) చేపట్టిన కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలను గురించి తెలుసుకుందాం:

### *1. టైలరింగ్ సెంటర్ ఏర్పాటు*

బోర్పట్లలో వున్న మహిళలకు నైపుణ్యాభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్)లో భాగంగా గత సెప్టెంబర్ నెలలో టైలరింగ్ శిక్షణ తరగతులను 53 మందితో (ఉదయం, సాయంత్రం) ప్రారంభించడం జరిగింది. ఇప్పటివరకు రెండు బృందాలకు (93 మందికి) శిక్షణ పూర్తయింది. ఇప్పుడు మూడవ బ్యాచి 26 మందితో కొనసాగుతున్నది. టైలరింగ్ సెంటర్‌లో నేర్చుకున్న వాళ్ళకి ఉషా కంపెనీ ద్వారా సర్టిఫికెట్స్ ఇప్పించడం జరిగింది.



### *2. జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘం*

బోర్పట్లలో వున్న రైతులను సంఘటితపరచి, బలోపేతం చేసి, వారికి కావలసిన వ్యవసాయ పరికరాలను రైతు సేవా కేంద్రం (కస్టం హైరింగ్ సెంటర్) ద్వారా అందించాలన్న



ఉద్దేశంతో ఈ వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. లక్ష్య సాధన భాగంగా మహీంద్రా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకొని 3 ట్రాక్టర్స్, డోసర్, 2 బేలర్లు, కల్టివేటర్, రోటావెటర్, ఫ్లౌ ష్రెడ్డర్‌ని కొనుగోలు చేయడం జరిగింది. ఈ వ్యవసాయ పరికరాలను ఈ సంఘంలో సభ్యత్వం వున్న వారికి మాత్రమే తక్కువ అద్దెకు పంపించడం జరుగుతుంది.

జై కిసాన్ వ్యవసాయ ఉత్పత్తి దారుల పరస్పర సహాయ సహకార సంఘం ప్రతినిధి బృందాన్ని క్షేత్ర సందర్శన కోసం కరీంనగర్ జిల్లాలోని ములకనూరు గ్రామానికి తీసుకెళ్ళి అక్కడ వారు పాటిస్తున్న విధి విధానాలను అవగాహనచేసుకునే అవకాశం కల్పించడం జరిగింది. ఈ క్షేత్ర సందర్శన ఫలితంగా వారు తమ జై కిసాన్ సంఘంలో కూడా అలాంటి మార్పుచేర్పులను తీసుకురావాలని తీర్మానించుకున్నారు.

### *3. మరుగుదొడ్ల నిర్మాణం*

బోర్పట్ల గ్రామానికి ప్రభుత్వం 274 మరుగుదొడ్లను మంజూరుచేసింది. వీటి నిర్మాణ బాధ్యతను చేపట్టిన మాస్ ఒక కంట్రాక్టర్‌కు బాధ్యతలు అప్పగించి 146 మరుగుదొడ్లను నిర్మించడం జరిగింది. 127 మంది తమ సొంతంగానే మరుగు

ఎక్కడ సాగాలో తెలియడం కాదు, ఎక్కడ ఆగాలో తెలియాలి ; లేకుంటే ఇక్కట్లు తప్పవు

దొడ్డిని నిర్మించుకున్నారు. ఒక్కొక్క మరుగుదొడ్డి నిర్మాణానికి ప్రభుత్వం 12,000 రూపాయలు మంజూరు చేస్తే, భాగస్వామ్య సంస్థ సహకారంతో మాస్ 5,000 రూపాయలను సమకూర్చింది. స్వంతంగా కట్టుకున్న వారికి 5000 రూపాయల చొప్పున వి డి సి ఆధ్వర్యంలో ఇవ్వడం జరిగింది.

***4. పాఠశాలల అనుసంధాన (స్కూల్ ట్రైనింగ్) కార్యక్రమం***

బోర్పట్లలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులను కొల్లూరులోని గాడియం స్కూల్‌లో వున్న విద్యార్థులతో అనుసంధానంచేసి వారి మధ్య స్నేహశీల వాతావరణాన్ని ఏర్పరచి వారిలో ప్రవర్తన మార్పుకు, అవగాహన పెంపొం



దించడానికి కృషి చేయడం జరిగింది. గాడియం స్కూల్‌లో వున్న సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లను ఇతర పరికరాలను ఎలా ఉపయోగించాలో బోర్పట్ల విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం, రకరకాల ఆటల పోటీల్లో చురుకుగా పాల్గొనేలా ప్రోత్సహించడం జరుగుతున్నది. విద్యార్థులు కూడా ఎంతో ఉత్సాహంగా పాల్గొంటూ అనేక కొత్త విషయాలను నేర్చుకుంటున్నారు.

***5. పాఠశాలలో జాతీయ దినోత్సవాలు***



ప్రాథమిక, ఉన్నత పాఠశాలలలో వివిధ జాతీయ, అంతర్జాతీయ దినోత్సవాలను జరుపుతూ, ఆటల పోటీలు పెడుతూ విద్యార్థులకు, అధ్యాపకులకు బహుమతులు ఇస్తూ ప్రోత్సహిస్తున్నాము. మాస్ సంస్థ సమకూర్చిన ప్రాజెక్టర్ ద్వారా తరగతులు నిర్వహించడం మరో విశేషం.

***6. అంగన్ వాడీలు***

అంగన్‌వాడీలలోని చిన్నపిల్లలను క్రమంతప్పకుండా అంగన్‌వాడీకి వచ్చేవిధంగా ప్రోత్సహిస్తూ వారికి పలకలను, తినుబండారాలను తగు సమయాలలో ఇవ్వడం, వారి భోజనం మెనూని పరిశీలించడం జరుగుతున్నది. గర్భిణులకు, బాలింతలకు, కౌమార బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రతను గురించి, పోషకాహారాన్ని గురించి అవగాహన కల్పించడం జరుగుతున్నది.

***7. మహిళా స్వయంసహాయ సంఘాలు***

ఊరిలో వున్న 53 మహిళా స్వయంసహాయ సంఘాలను బలోపేతం చేసి, వారికి పుస్తకాల నిర్వహణ గురించి, ఆడిటింగ్ గురించి శిక్షణ యిచ్చాము. ప్రతి గ్రామ సంఘం (విఓ) సభ్యులు కనీసం 1, 2 కార్యక్రమాలకు హాజరయ్యేలా



చూసి, వారికి జీవనోపాధుల మీద అవగాన కల్పించడం, చదువుకు ఉన్న ప్రాముఖ్యతను వివరించడం, వ్యక్తిగత మరుగుదొడ్లను ఉపయోగించేలా ప్రేరణ కల్పించడం జరుగుతున్నది.

***మహిళా సంఘాల క్షేత్ర సందర్శన***

ఊరిలోని మహిళా సంఘాల సభ్యులను క్షేత్రసందర్శనకై నస్తీపూర్, సాదుల్లానగర్ గ్రామాలకు తీసుకెళ్ళి అక్కడి సంఘాల ప్రతినిధులతో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసి,ఆ ఊళ్ళలోని సంఘాల స్థాయిలో బోర్పట్ల సంఘాలను బలోపేతం

పెద్ద చిన్న, పేద గొప్ప తేడాలు పాటించేది స్నేహమే కాదు

చేయడం జరుగుతున్నది.

*మహిళా దినోత్సవం*

మార్చ్ 8వ తేదీన మహిళా దినోత్సవాన్ని బోర్పట్ల ఊరిలో 100 మంది మహిళలతో మాస్ సారథ్యంలో ఘనంగా నిర్వహించడం, పలురకాల ఆటల పోటీలను పెట్టి గెలిచిన వారికి చక్కని బహుమతులను అందించడం జరిగింది.



మహిళలు ఏ విషయంలోనూ తక్కువ కాదు అనే భావనను వారిలో తీసుకురాగలిగాము.

*పర్యావరణ, ఉపాధ్యాయ,గణిత దినోత్సవాలు*

జూన్ 5వ తేదీన ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రాథమిక పాఠశాలలో 30 మొక్కలను ఊరిలోని ప్రముఖులు,యువకుల ఆధ్వర్యంలో నాటి వాటికీ ట్రీ గార్డ్ లను పెట్టడం, రోజూ వాటికి నీళ్ళు పోసే బాధ్యతను అధ్యాపకులకు విద్యార్థులకు అప్పగించడం జరిగింది.

సెప్టెంబర్ 5 వ తేదీన ప్రాథమిక ,ఉన్నత పాఠశాలలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి, ఉపాధ్యాయులను సన్మానించడం జరిగింది.

డిసెంబర్ 22 వ రోజున శ్రీనివాస రామానుజన్ జన్మ దినాన్ని పురస్కరించుకుని ప్రముఖుల సమక్షంలో రకరకాల గణిత ప్రదర్శనతో గణిత దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది. గణిత అధ్యాపకులను గౌరవించడం, ప్రదర్శనలలో గెలుపొందిన విద్యార్థులకు గణితానికి సంబంధించి విలువైన బహుమతులను అందించడం జరిగింది.

పై విధంగా వి డి సి ఆధ్వర్యంలో వివిధ రకాల కార్యక్రమాలను నిర్వహిస్తూ, ఊరికి కావలసిన అవసరాలపై ప్రముఖులతో చర్చలు జరిపి తగు నిర్ణయాలను తీసుకుంటూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో బోర్పట్లను ఒక ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో మాస్ దిన దినాభివృద్ధితో ముందుకు సాగుతున్నది. ■

## మూలాలను విస్మరించే పెరుగుదల

(6 వ పేజీ తరువాయి)

చేసిందో ఆ ప్రభుత్వాన్నే కూల్చి వేయడం ఒక గణనీయ పరిణామమని శ్రీ శ్రీరామ్ అన్నారు.

తన ప్రసంగం అనంతరం సభ్యులు అడిగిన ప్రశ్నలకు శ్రీ శ్రీరామ్ సమాధానాలు చెప్పారు.

తొలుత జ్యోతి ప్రజ్వలన, స్మరజిత్ రే చిత్రపటానికి పుష్పాంజలితో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రధాన కార్యదర్శి, మహిళాభివృద్ధి సొసైటీ ఛైర్మన్ కె. మాధవరావు గారు, నందితారే గారు, ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి డైరెక్టర్ జనరల్ శ్రీ బి పి ఆచార్య, మాస్ ఎండి, సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి , ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి లో శిక్షణ పొందుతున్న వందమందికి పైగా ఐ ఏ ఎస్ ప్రొబేషనర్లు పాల్గొన్నారు.

ముందుగా నందితా రే మాట్లాడుతూ, దేశంలో గ్రామీణ పేదరికం తగ్గిందనే మాట సరికాదని, నిజానికి అభివృద్ధిలో, సంపదలో పేదల వాటా తగ్గిందని అన్నారు. సి ఎస్ రెడ్డిగారు, మాధవరావు గారు తమప్రసంగాలలో పేదలపట్ల, పేదరిక నిర్మూలనపట్ల కీర్తిశేషులు స్మరజిత్ రే కు వున్న అంకితభావాన్ని, మహిళాభివృద్ధి సొసైటీ ఏర్పాటులో ఆయన నిర్వహించిన కీలక పాత్రను గుర్తుచేసుకున్నారు.

ఎం సి ఆర్ హెచ్ ఆర్ డి ఐ టి డైరెక్టర్ జనరల్ శ్రీ బి పి ఆచార్యమహిళాభివృద్ధి సొసైటీ తరపున శ్రీరామ్ గారిని, మాధవరావు గారిని, నందితా రే గారిని శాలువలతో సన్మానించారు. మాస్ డైరెక్టర్ శ్రీ మధుమూర్తి వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ■

స్నేహితుడికన్నా మిన్నగా ఒక్కొక్కసారి విరోధే విలువైన పాఠాలు నేర్పుతాడు

# రైతు ఉత్పత్తిదారుల సంస్థల నిర్మాణం, ప్రగతి

– బి.వెంకటేష్

రైతుల ఆదాయాన్ని పెంచాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మూడు జిల్లాలలోని పన్నెండు మండలాల్లో ఆంధ్రప్రదేశ్ ఉద్యాన పంటల శాఖ సౌజన్యంతో రైతులను సంఘటితపరచి వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థలుగా (ఎఫ్ పి ఓ లుగా) ఏర్పాటుచేసి ఈ రైతు సంస్థలను వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్ది, స్వయం సహాయం, పరస్పర సహాయం ఆలంబనగా రైతుల ఆదాయాన్ని పెంచాలని మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) సంకల్పించింది.

ఆ మండలాలు ఇవి : చిత్తూరు జిల్లాలోని పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కురబల కోట మండలాలు; అనంతపురం జిల్లాలోని పెద్దవడుగూరు, పామిడి, గార్లదిన్నె, గుంతకల్లు మండలాలు; కర్నూలు జిల్లాలోని మిడుతూరు, నందికొట్కూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు మండలాలు. 2018 నవంబర్ నెలనుండి పంట ఉత్పత్తులు, మార్కెటింగ్ సౌలభ్యం వున్న గ్రామాలను గుర్తించి, ఆయా మండలాల్లోని గ్రామాల నుండి రైతులను సమావేశపరచి వారు వ్యవసాయం లో ఎదుర్కొంటున్న సమస్యలకు (భూసార పరీక్ష మొదలుకొని, అనుకూల పంటల ఎంపిక, విత్తన ఎంపిక, సాగు విధానంలో మెళకువలు, ప్రకృతి వ్యవసాయం, ఉత్పత్తుల అమ్మకం), వాటి పరిష్కారాలకు ఒక ఉమ్మడి చర్చా వేదిక లేకపోవడంఇ లోటును గుర్తింపచేసి, అవగాహన కల్పించి ఆయా మండలాల్లోని రైతులు సభ్యులుగా వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థల ఏర్పాటును ప్రోత్సహించడం జరిగింది. ఈ ప్రక్రియ లో ఒక్కో ఎఫ్ పి ఓ లో మండలం లో గుర్తించిన 5 గ్రామ పంచాయతీల నుండి రైతులను సభ్యులుగా చేర్చు ప్రక్రియ కొనసాగుతున్నది. మొత్తంగా మండలంలోని అవకాశం ఉన్న గ్రామాల నుండి రాబోవు 6 నెలల కాలంలో ఒక్కో మండలంలో 1000 మంది సభ్యుల చొప్పున ఆయా మండలాల రైతు సంస్థలలో చేర్చే ప్రయత్నం ముమ్మరంగా జరుగుతున్నది.

| అనంతపురము జిల్లా | | కర్నూలు జిల్లా | | చిత్తూరు జిల్లా | |
|---|---|---|---|---|---|
| మండలము | పంట ఉత్పత్తి రకం | మండలము | పంట ఉత్పత్తి రకం | మండలము | పంట ఉత్పత్తి రకం |
| గుంతకల్లు | వేరుశనగ, పండ్లు, కూరగాయలు | గోనెగండ్ల, మొక్కజొన్న | పత్తి, మిర్చి, ఉల్లి, | పీలేరు | మామిడి, బొప్పాయి, టమోట, వరి, కూరగాయలు |
| గార్లదిన్నె | వేరుశనగ, పండ్లు, కూరగాయలు, వరి | ఎమ్మిగనూరు | పత్తి, మిర్చి, ఉల్లి, ఆముదం | కలికిరి | వేరుశనగ, టమోట, మామిడి, బొప్పాయి |
| పెద్దవడుగూరు | పత్తి, వేరుశనగ, పండ్లు, వరి | మిడుతూరు | పత్తి, మొక్కజొన్న, పప్పుశెనగ, కంది | కురబలకోట | వేరుశనగ, వరి, టమోట, మల్బరీ |
| పామిడి | పత్తి, వేరుశనగ, పండ్లు, వరి, కూరగాయలు | నందికొట్కూరు | మొక్కజొన్న, పప్పు శెనగ, కంది, మిర్చి, ఉల్లి | వాల్మీకిపురం | వేరుశనగ, వరి, టమోట, బొప్పాయి, దానిమ్మ |

వెన్ను చరచి ప్రోత్సహించే వారెవరూ లేకుంటే నీకు నీవే స్ఫూర్తి ప్రదాతవు కావాలి

**2. సభ్యత్వ ప్రగతి**

మే నెల వరకు సుమారు 1000 మంది రైతులు 3 జిల్లాల్లోని 12 మండలాల్లో సభ్యులుగా చేరడం జరిగింది వీరందరూ ఒక్కొక్కరు రూ.1500/- లు లేదా రూ.1000 లు వాటాధనం, సభ్యత్వ రుసుం రూ.150/-లు లేదా రూ.100 లు చెల్లించి సభ్యులుగా చేరడం జరిగింది. ఆయా మండలాల్లో చేరిన సభ్యుల సంఖ్యా వివరాలు :

| జిల్లా : అనంతపురము | | జిల్లా : కర్నూలు | | జిల్లా : చిత్తూరు | |
|---|---|---|---|---|---|
| మండలము | మొత్తం సభ్యులు | మండలము | మొత్తం సభ్యులు | మండలము | మొత్తం సభ్యులు |
| గుంతకల్లు | 137 | గోనెగండ్ల, | 210 | పీలేరు | 164 |
| గార్లదిన్నె | 111 | ఎమ్మిగనూరు | 193 | కలికిరి | 80 |
| పెద్దవడుగూరు | 157 | మిడుతూరు | 110 | కురబలకోట | 75 |
| పామిడి | 93 | నందికొట్కూరు | 130 | వాల్మీకి పురము | 30 |
| జిల్లా మొత్తం | 498 | జిల్లా మొత్తం | 643 | జిల్లా మొత్తం | 349 |

**3. ప్రమోటర్లు, వ్యవస్థాపకులకు శిక్షణ**

ప్రారంభంలో గుర్తించిన 20-నుండి 30 మంది సభ్యులకు 12 మండల కేంద్రాలలో రైతులు సంఘటితం కావలసిన ఆవశ్యకత, రైతు సంస్థల ఏర్పాటుపై శిక్షణలు ఏర్పాటుచేసి ఉద్యాన పంటల శాఖ అధికారులతో కలసి 2018 డిసెంబరు నుండి 2019 ఏప్రిల్ వరకు అవగాహన కల్పించటం జరిగింది.

**శిక్షణలో నేర్పిన అంశాలు**

- రైతు సంస్థల ఏర్పాటు ఆవశ్యకత





- రైతు సంస్థలకు ప్రభుత్వ ప్రోత్సాహం
- రైతులను సంఘాలలో విస్తృతంగా చేర్పించే బాధ్యతను ప్రమోటర్లు తీసుకోవడం
- రైతులు సంఘటితంగా చేపట్టే కార్యక్రమాల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర
- వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలను సంఘటితగా ఎదుర్కోవడం
- వివిధ సంస్థలతో (వ్యవసాయ, పండ్ల తోటలు, నాబార్డ్, మార్కెఫెడ్ లాంటి సంస్థలతో) అనుసంధానం చేసుకొని సేవలు పొందటం

నీ శక్తిని నీవే నమ్మకుంటే ఎలా? నమ్ము ... నీకంటె సాహసి, వివేకి, సమర్థుడు మరొకరు లేరు



**4. ములకనూరు రైతు సహకార సంస్థల సందర్శన**

సహకార రంగంలో విజయవంతమైన కృషికి స్ఫూర్తిగా నిలిచిన కరీంనగర్ జిల్లా ములకనూరు రైతు సహకార సంస్థను సందర్శించాలని ఈ 12 మండల రైతు సంఘాలు సంకల్పించాయి. ఆ మేరకు ఏప్రిల్ 11-12 తేదీలలో అనంతపురం జిల్లా గుంతకల్లు, గార్లదిన్నె, పెద్దవడుగూరు, పామిడి మండలాలు, ఏప్రిల్ 24-25 తేదీలలో కర్నూలు జిల్లా గోనెగండ్ల, ఎమ్మిగనూరు, మిడుతూరు, నందికొట్కూరు మండలాలు ; మే 29-30 తేదీలలో చిత్తూరు జిల్లా పీలేరు. కలికిరి, వాల్మీకిపురం మండల రైతు సంఘాల ప్రతినిధులు ములకనూరు సహకార సంస్థలను సందర్శించి వివిధ అంశాలను తెలుసుకున్నారు.

**నేర్చుకున్న అంశాలు:**

ఈ సందర్శనలో ముఖ్యంగా నాయకత్వం, మార్కెటింగ్ పద్ధతులు, రైతు ప్రాధాన్య విధానాలు, సేవలు, కార్యాచరణ ప్రణాళిక మొదలగు అంశాలలను గురించి తెలుసుకోవడం జరిగింది అదేవిదంగా, బ్యాంకు లోన్ ప్రక్రియ, రైస్‌మిల్లు, విత్తన ప్రాసెస్ కేంద్రం, కాటన్ మిల్లు, వ్యవసాయ పంపులు, పైపుల స్టోరు, బట్టల దుకాణం, వ్యవసాయ పెట్టుబడుల దుకాణం, ఆడి పరిశ్రమ కేంద్రం మొదలగునవి సందర్శించడం జరిగింది.

**ఆర్థిక వనరుల అంశాలు**

- 1956 సంవత్సరం నుండి ములకనూరు రైతు సహకార సంస్థ సేవలందిస్తున్నది.
- రైతుకు వ్యవసాయానికి అవసరమైన ఋణ మంజూరు 100కి నెలకు 1 రూపాయి వడ్డీతో ఇవ్వడం జరుగుచున్నది.
- వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రక్రియ, మార్కెట్ చేయడం ద్వారా సంస్థకు ఆదాయం లభిస్తుంది.

**పరిపాలన అంశాలు**

- 14 మంది డైరెక్టర్లు 14 గ్రామాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్నారు
- సంస్థ రోజువారీ కార్యకలాపాల్లో రాజకీయ జోక్యం లేకపోవడం
- క్రమం తప్పక ప్రతి సంవత్సరం వార్షిక మహాసభ నిర్వహించడం
- మహాసభకు 99% హాజరు ఉండటం
- బోర్డు నెలవారీ సమావేశాల్లో రైతుల సమస్యలు, అవసరాలు గురించి, వ్యాపార ప్రణాళిక గురించి, లాభదాయకత ఉన్న వ్యాపారాల గురించి చర్చించుట
- సభ్యులు కాని వారి జోక్యం లేకపోవడం
- సమర్థమైన మార్కెటింగ్ నిర్వహణ

**సేవల అంశాలు**

- సభ్యులైన రైతులందరికి సాంకేతిక శిక్షణలు ఇవ్వడం
- ఒకేచోట వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు తక్కువ ధరకు లభించటం
- భూసార పరీక్షకు తోడ్పాటు
- అన్ని వ్యవసాయ పరికరాల కొనుగోలుకు 1% వడ్డీకి అప్పు ఇవ్వటం
- రైతుల పిల్లల విద్యకు, ఉపాధి అవకాశాలకు అప్పులు ఇవ్వడం, స్కాలర్ షిప్పులు ఇవ్వడం
- అందరు రైతులకు బీమా, పెన్షన్ సేవలు అందించటం. పశువులకు కూడా బీమా సేవలు అందించటం
- మొత్తం 14 గ్రామాలలో ధాన్యం, వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగుల సౌకర్యం

జీవితమంటే మంచి మనిషిని వెదికి పట్టుకోవడం కాదు, మంచి అనుబంధం ఏర్పరచుకోవడం



- వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కల్పించడం
- సభ్యులకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించటం

**5. జిల్లా స్థాయి సదస్సులు**

అనంతపురం జిల్లాలో మే మొదటి వారంలో జిల్లా అధికారులు, మాస్ ప్రతినిధులు, కొత్తగా ఏర్పాటైన రైతు సంస్థల ప్రతినిధులతో జిల్లాస్థాయి సదస్సు నిర్వహించటం జరిగింది. ఈ సదస్సు రైతు ప్రతినిధులలో నూతనోత్సాహం నింపి రైతులను ప్రోత్సహించి రైతు సంస్థలను సరిఅయిన మార్గంలో నడుపుటకు, వాటి బలోపేతానికి ఎంతో ఉపయోగపడింది. ఇలాంటి సదస్సులను కర్నూలు, చిత్తూరు జిల్లాలలో కూడా నిర్వహించాలని సంకల్పించడం జరిగింది.

**6. మండల రైతు సంస్థలను రిజిస్ట్రేషన్ చేయుట :**

రైతు సంస్థలు వ్యాపార సంస్థలుగా తమ కార్యకలాపాలను చట్టబద్ధంగా నిర్వహించుటకు వీలుగా కంపెనీల చట్టం కింద లేదా సహకార చట్టం కింద నమోదు (రిజిస్ట్రేషన్) చేయాలని నిర్ణయం జరిగింది. ఈ సంకల్పం ప్రకారం పీలేరు, గోనెగండ్ల ఎమ్మిగనూరు. గుంతకల్లు, గార్లదిన్నె కంపెనీ చట్టం క్రింద, పెద్దవడుగూరు, పామిడి, కురబలకోట మండలాలను సహకార చట్టం కింద నమోదుచేయడం పూర్తయింది.

వచ్చే ఖరీఫ్ పంట కాలానికి రైతులకు ఉపయోగపడే ప్రారంభ కార్యక్రమాలతో ఈ రైతు సంస్థలను మరింత బలోపేతంగా, మరింత ప్రయోజనదాయకంగా తీర్చిదిద్ద డానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి.

**7. ప్రారంభ కార్యక్రమాలు :** రైతు ఉత్పత్తి సహకార సంఘాల ప్రారంబ కార్యక్రమాలలో భాగంగా మొట్ట మొదట చిత్తూరు జిల్లా కురబలకోట మండలం తెట్టు గ్రామ పంచాయతీలో



శ్రీ సిన్గారప్ప గారి శ్రీనివాసులు, శ్రీమతి రేణుక గారి తోటలోని నేరేడు పళ్ళను మార్కెట్ ధర కంటే కేజికి 4 రూ.లు ఎక్కువ చెల్లించి కురబలకోట మహిళా రైతు ఉత్పత్తి దారుల సంస్థ ద్వారా కొనుగోలు చేసి , కర్ణాటకలోని బిగ్ బాస్కెట్ కొనుగోలు కేంద్రంలో అమ్మడం జరిగింది.



ఈ మొదటి కొనుగోలు ద్వారా వచ్చిన లాభం రైతుకే అదనంగా పంపిణీ చేయాలని నిర్ణయించడం జరిగింది. అన్ని మండలాల్లో ఇటువంటి కార్యక్రమాలు అమలు చేయాలని నిర్ణయించడం జరిగింది.

ఈ కార్యక్రమాలను రాష్ట్రస్థాయిలో ఉద్యాన పంటల కమిషనర్, మాస్ సంస్థ తరపున ముఖ్య కార్య నిర్వహణాధి కారి శ్రీ సి ఎస్ రెడ్డి, కార్యక్రమ సంచాలకులు శ్రీ మధుమూర్తి, మార్కెటింగ్ సంచాలకులు శ్రీమతి మధుమంజరి, శ్రీ వెంకటేష్, శ్రీ కిషోర్ ; జిల్లా , క్షేత్ర స్థాయిలో ఆయా జిల్లాల డి.డి.హెచ్, ఏడి హెచ్, హెచ్ ఓ లు, చిత్తూరు జిల్లాలో శ్రీ వరప్రతాప్, శ్రీ కార్తీక్, శ్రీమతి చౌడమ్మ ; అనంతపురం జిల్లాలో శ్రీమతి రాజ్యలక్ష్మి, శ్రీ రమేష్‌బాబు, శ్రీ శంకర్, శ్రీ వేణు; కర్నూలు జిల్లాలో అపార్డ్ సంస్థ నుండి శ్రీ తిరుపతిరెడ్డి శ్రీ వెంగల్‌రెడ్డి, శ్రీ మురళీ, శ్రీ వెంకటేష్ తదితరులు మార్గదర్శకత్వం వహిస్తున్నారు. ■

ప్రతి సమస్యకు ఎన్నో పరిష్కారాలు, నీకు తెలిసినవి అనేకం వున్నా తెలియనిది ఒక్కటైనా వుంటుంది

# ఆహార వైవిధ్యంపై మూఢనమ్మకాల ప్రభావం!

– యమ్. నాగిరెడ్డి

గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలలో పోషణ, ఆరోగ్య స్థితి గతులను మెరుగుపరచడంలో స్వయం సహాయక సంఘాలు వేదికలుగా ఎంత సమర్ధవంతంగా పనిచేస్తాయనేది అర్థం చేసుకోవడానికి మహిళాభివృద్ధి సొసైటీ (మాస్ ) "జెండర్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్" అనే ప్రయత్నాన్ని పరిశోధనాత్మక కార్యాచరణ పథకం (యాక్షన్ రీసెర్చ్ ప్రాజెక్ట్ ) గా అమలు చేస్తున్నది.

తమ జెండర్ న్యూట్రిషన్ ప్రాజెక్ట్ కార్యక్రమాల అమలులో భాగంగా హైదరాబాద్ మహా నగరంలోని మలక్ పేట సర్కిల్, ఒంగోలు, తిరుపతి పట్టణాలలో ఆయా ప్రాంతాలలోని మహిళా సమాఖ్యలను, అంగన్వాడిలను కలుపుకొని గృహ సందర్శనలు, ప్రవర్తనలో మార్పు సమావేశాలు, మహిళా సమాఖ్యల ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి గర్భిణులు, బాలింతలకు పోషకాహారంలో లింగపరమైన తేడాల పైన, వైవిధ్యంపైన మాస్ సంస్థ అవగాహన కలిగిస్తున్నది.



తిరుపతి పట్టణం విషయాన్ని గమనిస్తే, ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు ఎక్కువగా వలస వస్తున్నారు. ఇలా వలస వచ్చిన వారు జీవకోన, బొమ్మగుంట ప్రాంతాలలో కనీస వసతులకు నోచుకోకుండా ఉండడమే కాకుండా అనేకమైన మూఢ విశ్వాసాలతో జీవిస్తుంటారు. ఈ మూఢ విశ్వాసాల కారణంగానే వీరు గర్భిణులకు, బాలింతలకు సరైన పోషకాహారం అందిచడం లేదు. ముఖ్యంగా సోమవారం, గురువారం, శుక్రవారం, శనివారం

మాంసాహారం, గుడ్డు నిషేధం. గర్భిణి నల్లగా ఉన్నటువంటి ఆహార పదార్థాలను తింటే పుట్టబోయే బిడ్డకు నల్ల రంగు వస్తుందని మరో బలమైన మూఢ విశ్వాసం వున్నది. పండ్లు తింటే పుట్టబోయే బిడ్డకు జలుబు వస్తుందని నమ్ముతున్నారు. గుడ్డు తింటే పుట్టబోయే బిడ్డకు వెంట్రుకలు రావు అనే అపోహ వున్నది. అదేవిధంగా ప్రసవానంతరం



కూడా శిశువుకు తల వెంట్రుకలు తీసేదాక గుడ్డు పెట్టడం లేదు. కొబ్బరి నీరు త్రాగడం వలన పుట్టబోయే బిడ్డకు జలుబు చేస్తుందని, వెంట్రుకలు రావనే నమ్మకం వున్నది.

బాలింత పగటిపూట నిద్ర పోకూడదని, నిద్ర పోతే పొట్ట పెరుగుతుందని, ఆరోగ్యానికి మంచిది కాదు అనే నమ్మకం వున్నది. బాలింత తక్కువ నీరు, ఆహారం తీసుకోవాలని, కేవలం చారు మాత్రమే తీసుకోవాలి అనే నిబంధన పెడుతున్ననారు, కారణం తల్లి వివిధరకాల ఆహార పదార్థాలు తీసుకొంటే బిడ్డకు అనారోగ్యం వస్తుంది అని బలమైన విశ్వాసం వున్నది. దీనితో బాలింతకు పథ్యం అనే పేరుతో చాలారకాల ఆహార పదార్థాలు తీసు కోకుండా నిబంధనలు పెడుతున్నారు.

పై అభిప్రాయాలను, వారి విశ్వాసాలు, శాస్త్రీయ అంశా

పరిచయం అనుబంధం కాదు, అర్థంచేసుకోవడమే ఆత్మీయ బంధానికి మూలం



లను బేరీజు వేసుకొని ఆహార వైవిధ్యంపై అనుభవం ఉన్న రిసోర్స్ పర్సన్స్ ద్వారా శిక్షణ పొందిన ఆరోగ్య కార్యకర్తలు, మెంటార్లు రోజూ వారి గృహ సందర్శనలు, ప్రవర్తనలో మార్పు సమావేశాలు, ఆహార వైవిధ్యంపై అవగాహనా కార్య క్రమాలను నిర్వహిస్తూ, వివిధ రకాల ఆహార పదార్థాలను సంఘ సభ్యుల చేత చేయించి వాటిలో ఉన్న పోషకాల గురించి చెప్పడం, ఇతర ప్రాంతాలలో ఆహార వైవిధ్యంపై అనుసరిస్తున్న ఉత్తమ ఆచరణ పద్ధతుల గురించి తెలియజేయడం, పౌష్టిక ఆహారం గురించిఉన్న వీడియోలు, ఫ్లిప్ బుక్స్ చూపించడం మొదలగు పద్ధతుల ద్వారా అవగాహన కలిగిస్తున్నారు. ఈ అవగాహనా కార్యక్రమాలు ఫలితం చూపిస్తున్నాయి.

గర్భిణులు, బాలింతలు తీసుకొనే ఆహారంలో మార్పులు వచ్చాయి. వారి రోజువారీ పనులలో భర్తల సహకారం కూడా ఉంటున్నది. బ్రాహ్మణ, వైశ్య సామాజిక వర్గాలకు చెందిన గర్భిణులు, బాలింతలు కూడా గుడ్లు తినడానికి అంగీకరించారు.

ప్రాజెక్ట్ అమలు అవుతున్న అన్ని ప్రాంతాలలో గర్భిణుల హిమోగ్లోబిన్ స్థాయి పెరిగింది. గర్భిణులు ఇతర ప్రాంతాలకు (కాన్పుకు అమ్మగారింటికి) వెళ్ళినా సరే ఆరోగ్య కార్యకర్తలు ఫోన్ ద్వారా వారికి సేవలు అందిస్తున్నారు.

ఈ సేవలను గురించి మహిళా సమాఖ్యల కార్య నిర్వాహక సమావేశాలలో వివరించి అన్ని కార్యక్రమాలలో వారిని ముందు వుంచి నడిపించడం జరుగుతున్నది. ■

## మహిళాభివృద్ధి సొసైటీ నిర్వహిస్తున్న ప్రాజెక్టులు

**స్వయం నియంత్రణ ఉద్యమం :** కామారెడ్డి

**మాతా శిశు పోషకాహారం:** హైదరాబాదు నగరం, ఒంగోలు, తిరుపతి పట్టణాలు

**స్వయంసహాయ సంఘాల ప్రాజెక్ట్ (ఇ అండ్ వై) :** బీహార్

**వాటర్‌షెడ్ కార్యక్రమాలు:** అనంతపురం, చిత్తూరు, అదిలాబాద్ జిల్లాలు

**ఏ పి డి ఎం పి (కరువు నివారణ పథకం) :** అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలలో 315 గ్రామ పంచాయతీలు

**స్టార్టప్ విలేజ్ ఆంటర్‌ప్రెన్యూర్‌షిప్ ప్రోగ్రాం:** తెలంగాణాలోని సంగారెడ్డి, భద్రాద్రి-కొత్తగూడెం జిల్లాలు

**ఎఫ్ పి ఓ లను వ్యాపార సంస్థలుగా తీర్చిదిద్దడం:** చిత్తూరు, కర్నూలు, అనంతపురం జిల్లాలు. దీనితో పాటు తెలంగాణా కామారెడ్డి జిల్లాలోని సదాశివనగర్ మండలంలో ఎఫ్ పి ఓ ల ఏర్పాటును ప్రోత్సాహం

**జి4 ప్రాజెక్ట్ :** అనంతపురంజిల్లా నల్లమాడ మండలం, చిత్తూరు జిల్లా వి కోట, రామసముద్రం మండలాలు

**గ్రీన్ ఇన్నొవేషన్ సెంటర్ :** చిత్తూరు జిల్లా

**ఆజీవ** (వ్యవసాయంలో మహిళలకు ప్రోత్సాహం ద్వారా లైంగిక సమానత్వ సాధన): అనంతపురం, యాదాద్రి జిల్లాలు

**ఎఫ్ ఎస్ సి ఏర్పాటు :** చిత్తూరు జిల్లా పీలేరులో రైతు సేవా కేంద్రం

**క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రోగ్రాం:**అనంతపురం, నల్లమాడ మండలాలు

ఆదర్శ గ్రామాలు: అల్లూరు, పెయ్యలపాలెం, శ్రీరామాపురం గ్రామాలు (నెల్లూరు జిల్లా) ; బోరపట్ల (సంగారెడ్డి జిల్లా

**ఆర్థిక సహాయ సంస్థలు, భాగస్వామ్య సంస్థలు**

జి ఐ జడ్, అరబిందో, డి జి ఆర్ వి, రబెడ్ ఫర్ ది వరల్డ్, ఇ వై ఫౌండేషన్, ఆంధ్రప్రదేశ్, తెలమగాణా రాష్ట్రాల ప్రభుత్వాలు, సెర్ప్, నాబార్డ్, ప్రవేశ, వరల్డ్ వెజిటబుల్ సెంటర్, ఇ-ఫ్రెష్, మేనేజ్, మహీంద్ర, మై గ్రోమోర్, మోర్. బిగ్ బాస్కెట్, ఎకాలజీ సెంటర్ మొదలైనవి. ■

ఓర్పు, పట్టుదల, శ్రమించే తత్వం నీవైతే గెలుపు నీదే

# మనోవ్యధకు గురైన గర్భిణిలో మార్పు తెచ్చిన 'మాస్' !

– అంజుమ ఫాతిమ

హైదరాబాద్‌లోని ఫూల్‌బాగ్‌కు చెందిన సిద్ర వయస్సు 21 సంవత్సరాలు. తండ్రి పెయింటర్, తల్లి గృహిణి. సిద్ర వాళ్ళు ఇద్దరు అక్కచెల్లెళ్ళు, ఇద్దరు అన్నదమ్ములు. సిద్ర 9వ తరగతి వరకు మాత్రమే చదివింది.

సిద్ర 20 రోజుల బాలింత. ఆపరేషన్ ద్వారా ఆడపిల్లను కనింది. (2.7 కె.జి.) ఇదంతా మామూలే కదా, ఎందుకు చెబుతున్నారనిపించవచ్చు. అయితే ప్రసవానికి ముందు ఆమెకు రక్తంలో హిమోగ్లోబిన్ 8 శాతం మాత్రమే ఉంది, తన భర్త గురించి మానసిక వేదన వలన తనకు ఆహారం మీద అయిష్టత ఏర్పడింది. ఏదీ వద్దువద్దు అనేది. తల్లి ఎంత బ్రతిమాలినా తినేదికాదు. ఈ విషయాలను 'మహిళాభివృద్ధి సొసైటీ'(మాస్) బృందం గృహ సందర్శనలో భాగంగా ఆమె ఇంటికి వెళ్ళి ఆమె అమ్మతో, ఇరుగుపొరుగువారితో మాట్లాడినపుడు తెలిశాయి. విషయం గ్రహించిన మాస్ బృందం ఆమె ప్రవర్తన లో ఏవిధంగా మార్పు తీసుకోనిరావాలా అని ఆలోచించి, ఆ ప్రాంతానికి చెంది తాము నమోదు చేసుకున్న పేర్లలో గర్భిణి అయిన ఆమె వదినను (హాజారా) పిలిపించి ఆమె సమక్షంలో సిద్రాతో మాట్లాడడం జరిగింది. హాజారాను పిలిపించడానికి కారణం ఆమెకూడా ముందు ఇలానే ఆహారం సరిగ్గా తీసుకొనేది కాదు. అయితే ఆమెకు అవగాహన కలిగించడంతో ఆమె పల్లీ పట్టీలు, రాగి జావ తీసుకోవటం ప్రారంభించింది. అవి తీసుకున్నందువల్ల తన ఆరోగ్యం మెరుగుపడిందని ఆమె స్వయంగా మాస్ ప్రతినిధులకు చెప్పి వున్నది. ఆ విషయాన్నే సిద్రా ఆమెతోనే సిద్రా ముందు చెప్పించడం జరిగింది.

దీనికితోడు, ఆమె ఇంటి ప్రక్కనే సమాఖ్య ఓ.బి. సభ్యురాలైన ఫౌజీయా ఉంది. ఆమె చాలా చురుకుగా చుట్టు ప్రక్కల వారి సమస్యలను అర్థం చేసుకుంటుంది. ఫౌజీయా సిద్రాతో చాలా సన్నిహితంగా ఉండటం గమనించి, సిద్రా సరైన ఆహారం తీసుకునే విధంగా ఆమె ద్వారా కూడా చెప్పి ఒప్పించాలని ఆమెను కూడా పిలిపించి ఆ బాధ్యతను ఆమె తీసుకునేలా మాస్ బృందంవారు ఒప్పించారు.



సిద్రాకు కుటుంబ సభ్యుల నిరాదరణ కూడా తోడైనట్టు ఆమె తల్లి మాట్లాడిన తీరునుబట్టి మాస్ బృందానికి అర్థమైంది. సిద్రా తల్లి సిద్రా ముందే సిద్రా వల్ల తమకు చాలా సమస్యలు వస్తున్నాయని, వాళ్ళాయన పట్టించుకోక పోవడం వల్ల తమకు ఖర్చు ఎక్కువ అవుతున్నదని, సిద్రా భర్త సంపాదన సరిగ్గా లేనందున బాధ్యతలన్నీ తన కొడుకుల మీదే పడుతున్నాయని కోపంగా మాట్లాడింది. మనుషుల ప్రవర్తనలో సానుకూలమైన మార్పు తీసుకువచ్చే విధంగా సలహా సంప్రతింపులు సాగించడంలో (బి సి సి) మాస్ సభ్యులు శిక్షణ పొంది వున్నారు కాబట్టి సిద్రా అక్కడనుంచి వెళ్ళిపోయిన తరువాత ఆమె తల్లితో సిద్రా సమక్షంలో ఆమె సిద్రాను గురించి అలా చెప్పకూడదని, అలాంటి మాటలు గర్భవతి అయిన ఆమె ఆరోగ్యాన్ని కుంగదీస్తాయని నచ్చజెప్పడం జరిగింది. మాస్ సభ్యులు ప్రతిరోజూ సిద్ర ఇంటికి వెళ్ళి తాము చెప్పిన విషయాలను ఆమె ఎంతవరకు పాటిస్తున్నదో గమనించేవారు. అలానే హాజరా కూడా ఆహారం మీద అవగాహన కల్పిస్తూ తను వండిన పదార్థాలను కూడా సిద్రాకు ఇచ్చి తినిపించేది. అలానే ఫౌజీయా కూడా ఆమెకు అవసరమైన సలహాలు, సూచనలు యిస్తూ, ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తూ వెన్నంటి ఉండేది. ఈవిధంగా మాస్ సభ్యులు చొరవ తీసుకుని, సిద్రా ఆహారపు అలవాట్లలో ఆరోగ్య పరిస్థితిలో చెప్పుకోదగిన మార్పును తీసుకురాగలిగారు.

ఇలా అందరూ తన కూతురిని జాగ్రత్తగా చూడడం వల్ల ఆమె చక్కగా ప్రసవించి, ఆరోగ్యమైన బిడ్డ పుట్టడం జరిగిందని, ఇదంతా 'మాస్' వారు ఇచ్చిన అవగాహన ఫలితమేనని సిద్రా తల్లి సంతోషంగా మాస్ సభ్యులకు కృతజ్ఞతలు చెప్పింది. ■

**సానుకూల ధోరణిలో అర్థంచేసుకునే స్వభావం వుంటే, కష్టమైనా, సుఖమైనా ఆనందమే**

# రైతులకు ఎఫ్ పి ఓ లు అందించే సేవలు !

– బి.అశోక్ కుమార్

మన దేశంలో, రాష్ట్రంలో సారవంతమైన భూములు, అనుభవజ్ఞులైన కష్టపడే రైతులు, ఆదాయాలు పెరిగిన ప్రజా ప్రభుత్వాలు ఉండి కూడా అసంఖ్యాక రైతులు ఎందుకు అధోగతి పాలవుతున్నారు ? అన్ని రంగాలు దినదినాభివృద్ధి సాధిస్తున్నా ఒక్క వ్యవసాయ రంగం మాత్రమే ఎందుకు కుచించుకుపోతున్నది ?

ఆర్థికాభివృద్ధి ఎగసి పడుతున్నదని గొప్పలు చెప్పు కుంటున్న పాలకులు వ్యవసాయాభివృద్ధిపై నీళ్ళు నమలడం



ఎందుకు? ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనుకకు తగ్గకుండా మొండి ధైర్యంతో రైతులు సేద్యం కొనసాగిస్తున్నారు కాబట్టే ఈమాత్రం అన్నమైనా జాతికి దొరుకుతున్నది.

వారు కూడా విరక్తితో ఒక ఏడాది కాడి పడేస్తే, మన దేశంలో ఉన్న 120 కోట్ల జనాభా గతి అధోగతి కాక తప్పదు. వ్యవసాయ రంగాన్ని ఇతర పరిశ్రమలతో సమానంగా పరిగణించి రైతుకు ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం కల్పించి పెద్ద ఎత్తున నిధులు ప్రవహింపచేస్తే తప్ప ఈ రంగం బతికి బట్ట కట్టే పరిస్థితి కనుపించడం లేదని ఎన్నో కమిటీలు ప్రభుత్వాలకు సిఫారసు చేశాయి. వాటి అమలుకు మాత్రం ప్రభుత్వాలు పూనుకోవడం లేదు.

రైతు సౌభాగ్యమే తమ ధ్యేయమంటూ ప్రభుత్వాలు జోలపాటలతో రైతుల్ని మభ్యపెడుతున్నాయి. అలుపెరుగని శ్రామికుల్లా రైతులు బతుకు పోరు చేస్తూ జాతికి ఆహారాన్ని అందిస్తుంటే అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వారిని బిచ్చగాళ్ళుగా చేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో రైతులు సంఘటితమై ఉద్యమించవలసిన తక్షణావసరం నేడు ఎదురయ్యింది.

కష్టకాలంలో ఎప్పుడు ఏమొస్తుందో, ఏమిస్తారా అని ఎదురు చూడకుండా, కరువు పల్లెలు తామంతట తాముగా తమ సామర్థ్యం పెంచుకుని ఆ కష్టాన్ని తట్టుకుంటూనే ఎదుగుదలకు అవసరమైన బాటలు వేసుకోవ డానికి ఊతమిచ్చే ప్రయత్నం.. ఆంధ్రప్రదేశ్ కరువు సంసిద్ధతా పథకం అనే 'పల్లె జీవం' కార్యక్రమం.

వర్షాధార వ్యవసాయం, వాతావరణ మార్పులు, కరువు ప్రభావాలు, రైతుల సంక్షోభ పరిస్థితులు ఇవన్నీ ఈనాటి వాస్తవాలు. ముందు ముందు కొనసాగడానికి కూడా అవకాశమున్న చేదు నిజాలు . వాటికి మనం ఏ రీతిలో, ఎలా సంసిద్ధమవు తున్నామనేదే ఇప్పుడున్న కీలక ప్రశ్న. దానికి సమాధానమే ఈ 'పల్లె జీవం' కార్యక్రమం...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కరువు సంక్షోభ జిల్లాలోని రైతులను సంసిద్ధపరిచి, వాళ్ళపై కరువు ప్రభావాన్ని తగ్గించ డానికి చేస్తున్న ఒక ప్రయత్నం ఇది. అవసరమైన సహాయక వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు

ఎదుర్కొనే కరువు ప్రభావాన్ని తగ్గించడం, ఆ కుటుంబాల జీవన భద్రత పెంచడం అనేది ఇందులోని కీలక అంశం.

రైతు సంఘాలు, పంటలు, పశు జీవ వ్యవస్థల బలోపేతం, భూగర్భ జలం, ఉమ్మడి వనరుల సమర్థ యాజమాన్యం, ప్రజల జీవనోపాధులను, సంబంధిత ఉత్పత్తి వ్యవస్థలను మెరుగైన స్థాయిలో పటిష్టపరచడం.

ఆ దిశలో గ్రామ స్థాయిలో అవసరమైన సేవలను అందించే వ్యవస్థలను మెరుగుపరచడం ద్వారా రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కోగలిగేలా చేయడం ఈ కార్యక్రమం అంతిమ లక్ష్యం.

**వ్యవసాయ ఉత్పత్తి దారుల సంఘం (ఎఫ్ పి ఓ)**

పంటలు, పశు జీవ వ్యవస్థల, ఉత్పత్తి వ్యవస్థల బలోపేతం, సంభందిత సేవలను అందించే అంశాలను రైతు సంఘం చూస్తుంది.

స్థానికంగా ఉన్న ఔత్సాహిక వ్యక్తులను గుర్తించి, వారి ద్వారా వ్యవసాయోత్పత్తుల వ్యాపారాలకు ప్రోత్సాహం ఇస్తూ సేవలు అందిస్తుంది.

ఇందులో కొన్ని ఉచితంగా అందించే సేవలు కాగా, మరికొన్ని సేవలకు నిర్దిష్ట రుసుము చెల్లించవలసి ఉంటుంది. సేవలు ఎప్పటికి కొనసాగడానికి గాను, కొన్ని కీలక సేవలను వ్యాపారాత్మక స్థాయిలో నిర్వహిస్తారు

చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించడం, ఉమ్మడిగా కొనుగోలు చేసి, సంఘ సభ్యులకు తక్కువ ధరకు వ్యవసాయానికి కావలసిన విత్తనాలను, ఎరువులను విక్రయించడం వంటి కార్యక్రమాలను వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం నిర్వహిస్తుంది.

**ఎఫ్‌పిఓ అందించు సేవలు**

క్లిక్ కేంద్రాలు (వ్యవసాయ వాతావరణ సమాచార కేంద్రాలు), పరికరాల అద్దె కేంద్రాలు, ఇతర సహాయ వ్యవస్థల ద్వారా ఎఫ్‌పిఓ ఈ కిందతెలిపిన సేవలను అందిస్తుంది.

- సమాచార సేవలు (వాతావరణం, పంటలు, తెగుళ్ళు సమాచారం, భూగర్భ నీటి స్థితిగతులు వివరాలు, మార్కెట్ ధరలు వంటివి )
- భూసార పరీక్షల సేవలు
- జీవ ఎరువులు, మందుల అమ్మకం
- వ్యవసాయ పనిముట్లను, యంత్ర పరికరాలను రైతులకు అద్దెకు ఇచ్చే కేంద్రం నిర్వహణ
- విత్తన పంపిణీ సేవలు
- పశు జీవాలకు టీకాలు వేయడం
- పశువులకు వచ్చే రోగాలకు మందులు వేయడం
- జీవాలకు అదనపు దాణా, పోషకాహారం
- రక్షక తడి అందించడానికి అవసరమైన యంత్రాలను, పరికరాలను సమకూర్చడం
- గడ్డి జాతుల, బయోమాస్ మొక్కల విత్తనాలు
- పంట ఉత్పతులకు మార్కెటింగ్ సహకారం
- కార్యక్రమంలో ఆయా కీలక అంశాలకు సంబంధించిన వివరాలు, డేటా నమోదు. నిర్వహణ సంబంధిత సేవలు.
- విత్తన కేంద్రం (సిఎంఎస్ఎస్) ద్వారా సంఘ సభ్యులకు ప్రభుత్వం నుంచి అందవలసిన రాయితీ వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేయడం
- నవధాన్యాలను పంపిణీ చేయడం
- చిరుధాన్యాల పంటలను ప్రోత్సహించడం ఉమ్మడిగా కొనుగోలు చేయడం
- సంఘం సభ్యులకు తక్కువ ధరకు వ్యవసాయానికి కావలసిన విత్తనాలను, ఎరువులను విక్రయించడం
- సేంద్రియ ఎరువుల విక్రయ కేంద్రం ఏర్పాటు
- కషాయాల విక్రయ కేంద్రం ఏర్పాటు
- సన్నజీవాలు, కోళ్ళకు కావలసిన టీకాలు వేయడం, వాటికి అవసరమైన మందులు విక్రయ కేంద్రం ఏర్పాటు
- నిరుపేదల జీవనోపాధి పెంపుదలకు కృషి చేయడం

■

# సమీకృత వ్యవసాయంతో జి4 ప్రాజెక్ట్ పురోగతి !

– జి అమరేంద్రుడు

మహిళా అభివృద్ధి సొసైటి (మాస్) అనంతపురం జిల్లా నల్లమాడ మండలంలోను, చిత్తూరు జిల్లాలోని రామ సముద్రం, వి.కోట మండలాలో సమగ్ర నీటి యాజమాన్యం పథకం (ఐడబ్ల్యుఎంపి) అమలవుతున్నందున, ప్రాజెక్టు పరిధిలో ఎక్కువగా వున్న చిన్న, సన్నకారు రైతు కుటుంబాలకు వ్యవసాయంలో వున్న సాధక బాధకాలలో మార్గదర్శకంగా



వుండేందుకు జర్మనీకి చెందిన 'బ్రెడ్ ఫర్ ది వరల్డ్' (బిఎఫ్‌డిడబ్ల్యు) సంస్థ ఆర్థిక సహకారంతో జి 4 ప్రాజెక్ట్ పెరిట సమీకృత వ్యవసాయ విధానాల పెంపుదల, వ్యవసాయ పరిశ్రమల ఏర్పాటు కార్యక్రమాలను 2014 నుండి 2017 వరకు అమలు చేయడం జరిగింది. ప్రాజెక్టు రెండవ దశ 2017 ఏప్రిల్ నుండి నల్లమాడ, వి.కోట మండలాలలో అమలు జరుగుతున్నది. ఈ ప్రాజెక్ట్‌లోని వివిధ విభాగాలలో జరిగిన పురోగతిని తెలుసుకుందాం:

**రైతు, రైతు కూలీల సంస్థల ఏర్పాటు, బలోపేతం**

- 2478 మంది రైతులతో 208 గ్రామస్థాయి రైతు సంఘాలను ఏర్పాటుచేసి ప్రతి నెల సమావేశాలు, పుస్తక నిర్వహణ.
- 38 రైతు కూలీ, శక్తి సంఘాల ఏర్పాటు; సమావేశాలు, పుస్తక నిర్వహణ. ఇతర ప్రభుత్వ సంస్థలతో జి4 ప్రాజెక్టు, జీవనోపాధుల అనుసంధానం.
- పంచాయతీ పరిధిలోని రైతు సంఘాలతో 15 గ్రామ రైతు సంఘాలు (జిఆర్ఎస్) సహకార చట్టం ప్రకారం ఏర్పాటు, ప్రతి నెల సమావేశాలు, పుస్తక నిర్వహణ.
- 15 గ్రామ రైతు సంఘాలలో 2002 కుటుంబాలు రూ.లు 1000 వంతున షేర్ల చెల్లింపు.
- 11 గ్రామ రైతు సంఘాలు (జిఆర్ఎస్) వ్యవసాయ పెట్టుబడుల వ్యాపారం (పశువుల దాణా, సూక్ష్మ మూలకాలు, వేప చెక్క) నిర్వహణ.
- నల్లమాడ, వి.కోట మండలాలలో "మండల రైతు సమాఖ్య"ల ఏర్పాటు క్రమం తప్పని నెలసరి సమావేశాలు, పుస్తక నిర్వహణ.
- 15 గ్రామ రైతు సంఘాలు, మండల రైతు సమాఖ్య విజన్ బిల్డింగ్ ప్రణాళిక తయారీ, అమలు.

**మండల రైతు సమాఖ్యల ద్వారా కార్యక్రమాలు**

- వి.కోట మండల సమాఖ్య ద్వారా 425 రైతుల నుండి కూరగాయలు, పండ్లు 59 విడతల వ్యాపారం చేసి 16,78,011 రూపాయల టర్నోవర్ సాధించడం
- నల్లమాడ మండల సమాఖ్య ద్వారా మార్క్ ఫెడ్, నాఫెడ్ ద్వారా 3522 క్వింటాళ్ళ కందుల సేకరణ, అమ్మకం ద్వారా 1,91,13,150 రూపాయల టర్నోవర్ సాధించడం
- నల్లమాడ మండల సమాఖ్య ద్వారా సిఎంఎస్ఎస్ కార్యక్రమం ద్వారా 660 సంచుల వేరుశనగ, 353 నవధాన్య కిట్స్ సేకరణ, సరఫరా.

**సమీకృత వ్యవసాయ విధానాల ఆచరణ**

- సమీకృత వ్యవసాయ విధానాల ఆచరణ కోసం 15

వెనుక చింతించడం కంటె ముందు జాగ్రత్తపడడం మంచిది





ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు, కొనసాగింపు.

- 1016 ఎకరాల విస్తీర్ణంలో సమీకృత వ్యవసాయం
- 56 రైతు క్షేత్ర పాఠశాలలు వేరుశనగ, కూరగాయల పంటల ప్రదర్శన క్షేత్రాలలో నిర్వహణ.
- మండల సమాఖ్యల ద్వారా విత్తన బ్యాంకుల కొనసాగింపు.
- 60 శక్తి సంఘాల కుటుంబాలకు గొర్రెలు, గ్రామీణ వృత్తుల వారికి జీవనోపాధుల చేయూత.
- రైతు సేవా కేంద్రాల ద్వారా వ్యవసాయ పనిముట్లు, ఇతర వ్యవసాయ పెట్టుబడులు తక్కువ అద్దెకు సరఫరా
- 123 ఎకరాలలో చిరుధాన్యాల పంటలు పునరుజ్జీవం.
- శక్తి సంఘాల కుటుంబాలకు సుస్థిర తేనె సేకరణ, బుట్టల అల్లకం, టైలరింగ్‌పై శిక్షణ

■

## మహిళాభివృద్ధి సొసైటీకి గుర్తింపులు, అవార్డులు !

- ఏపిమాస్ ప్రచురణలకు అమెరికా పార్లమెంట్ (కాంగ్రెస్) గ్రంథాలయంలో స్థానం
- స్వయంసహాయ ఉద్యమాన్ని తీర్చిదిద్దడంలో మహిళాభివృద్ధి సొసైటీ విశిష్ట కృషికి భారత ప్రభుత్వ గుర్తింపు
- ఏపిమాస్ సి ఇ ఓ కు 2012 లో 12 వ ప్రణాళికా సంఘం సారథ్యసంఘం సభ్యత్వం
- 2012 లో ఏపిమాస్ సి ఇ ఓ కు ఎన్ ఆర్ ఎల్ ఎం పై ప్రణాళికా ఉపసంఘం ఛైర్మన్ పదవి
- స్వయంసహాయ సంఘాలపై విశిష్ట సేవలకు 2016 లో ఏపిమాస్ సి ఇ ఓ కు వఖార్డ్ అవార్డు
- 2007 లో ఏ పి ప్రభుత్వం ఏర్పాటుచేసిన జి ఓ, ఎన్ జి ఓ ల సమన్వయ కమిటీలో ఏపిమాస్ కు సభ్యత్వం
- ఏపిమాస్ కు జాతీయ స్థాయి సామర్థ్య నిర్మాణ సంస్థగా ఎన్ ఆర్ ఎల్ ఎం, ఎన్ ఏ ఎల్ ఎం గుర్తింపు
- రాష్ట్ర స్థాయిలో , అనంతపురం జిల్లా స్థాయిలో రెండు పర్యాయాలు వాటర్‌షెడ్ ఉత్తమ నిర్వహణ అవార్డు
- టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైంటిఫిక్ స్టడీస్ నిర్వహణలోని బి ఆర్ ఎల్ ఎం భాగస్వామిగా ఏపిమాస్ కు స్థానం
- బీహార్ ఇస్మాయిల్‌పూర్ ఏపిమాస్ మార్గదర్శకత్వంలోని స్వయం సహాయతా సమూహ్ (ఎస్ ఎస్ ఎస్)కు అవార్డు
- ఎస్ హెచ్ జి లపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రాష్ట్రస్థాయి యాజమాన్య సంఘంలో ఏపిమాస్ సి ఇ ఓ కు సభ్యత్వం
- ఏపిమాస్ మార్గదర్శకత్వంలోని హిందూపురం టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు జిల్లాస్థాయి ఉత్తమ టి ఎల్ ఎఫ్ అవార్డు

■

**విజ్ఞానాన్ని మించిన ఆయుధం లేదు, వివేకాన్ని మించిన సాధనం లేదు**

# అభివృద్ధి పథంలో పీలేరు రైతు సేవా కేంద్రం !

– ఎస్. వినాయక రెడ్డి

రైతులకు ఉత్పాదకత పెంపుదల సేవలు, విజ్ఞాన, సమాచార సేవలు అందించడం, రైతుల ఉత్పత్తులకు విలువ జోడింపు ప్రక్రియను వర్తింపజేసి మార్కెటింగ్ సేవలు అందేలా చూడడం ముఖ్య ఆశయాలుగా చిత్తూరు జిల్లా పీలేరులో రైతు సేవా కేంద్రాన్ని మహిళాభివృద్ధి సొసైటీ (మాస్) ఏర్పాటు చేసింది. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహాయంతో ప్రారంభమైన ఈ ప్రాజెక్ట్ పీలేరు చుట్టూ ఉన్న 3 మండలాలలో అమలుజరుగుతున్నది.




## రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఏర్పాటు

- పీలేరు, కలికిరి మరియు కెవి పల్లె మండలాలలోని 10 మంది వ్యవస్థాపకులతో పీలేరు రైతు ఉత్పత్తిదారుల సంస్థను మాస్ ఏర్పాటు చేసింది. ఇది 2018 డిసెంబరులో కంపెనీ చట్టం క్రింద రిజిస్టరు చేయ బడింది. ఇందులో ప్రస్తుతం 152 మంది సభ్యులు ఉన్నారు. ప్రతినెలా 5వ తేదీ పాలక వర్గ సమావేశాన్ని నిర్వహించి, పాజెక్టు కార్యక్రమాలను అమలు చేస్తున్నారు.
- సంస్థను పటిష్టంగా, సువ్యవస్థితంగా నిర్వహించుకునే సామర్థ్యాన్ని సంస్థ ప్రతినిధులకు సమకూర్చడానికై శిక్షణా పరికరాలను తయారుచేసి. నాలుగు శిక్షణలు, క్షేత్ర సందర్శన నిర్వహించబడినది. గ్రామాలలోని రైతు సంఘాలకు సమావేశాలను నిర్వహించి ప్రభుత్వ కార్యక్రమాలను గురించి తెలియజేయడం జరుగుతున్నది.



## పశు వైద్య సేవా కార్యక్రమాలు

- సంచార పశువైద్య సేవలు అందించడంకోసం ఒక పశువుల డాక్టరును, ఒక అసిస్టెంట్‌ను నియమించడం జరిగింది. ఒక వ్యాన్ కొని అందులో అత్యవసరమైన మందులు ఉంచుకొని, పీలేరు, కలికిరి, కేవిపల్లె మండలాలలో నిర్ణయించిన గ్రామాలకు వారానికి 5రోజుల చొప్పున పై సిబ్బంది వెళ్ళి,పశు వైద్య సేవలు అందిస్తున్నారు.



3 మండలాలలో యిప్పటికి 12 పశువైద్య శిబిరాలు నిర్వహించి, 1087 రైతులకు సంబంధించిన 1450 పశు వులకు 1350 గొర్రెలకు, 283 దూడలకు పిడుదులు, గర్భకోశవ్యాదులు, నులిపురుగుల నివారణ చికిత్స అందించడం జరిగింది. కొన్నింటికి ఉచితముగా మందులు అందిస్తున్నారు.

## రైతు సమృద్ధి కేంద్రం

- ఈ-ఫ్రెష్ వారితో కలసి పీలేరు వ్యవసాయ మార్కెట్

మొరిగే కుక్కతో ముప్పు లేదు, మొరగని కుక్కతోనే ముప్పంతా

కమిటీలో 'రైతు సమృద్ధి కేంద్రం' ఏర్పాటు చేయడం జరిగింది. దీనిద్వారా పశువులకు పోషక లవణాలు, దాణా, వ్యవసాయ పనిముట్లు, విత్తనాలు మొదలగునవి రైతులకు సరసమైన ధరలకు అందిస్తున్నారు. 8 మంది రైతులకు కొన్ని రకములైన గడ్డి విత్తనాలను అందజేశారు.

- ఎరువులు, విత్తనాల విక్రయానికి కూడా లైసెన్సులు తీసుకోవడంజరిగినది. కావున వీటిని కూడా రైతులకు అందించాలని ప్రయత్నిస్తున్నారు.

**వ్యవసాయ ఉత్పాదక పెంపుదల కార్యక్రమాలు**



- ఒక ఉద్యాన విస్తరణ అధికారిని నియమించి, తన ద్వారా రైతులకు అవసరమైన సలహాలను అందించడం జరుగుచున్నది.
- ప్రతిరోజూ కొంతమంది రైతులను కలసి వారి పంటలకు కావలసిన సలహాలు ఇవ్వడం
- నూతన వ్యవసాయ విధానాలపై రైతులకు సలహాలు





- ఏడుగురు ఆదర్శ రైతులను గుర్తించి, వారి ద్వారా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయడానికి ప్రోత్సాహం
- రైతుల సమస్యల గురించి, నూతన వ్యవసాయ విధానాల అవసరం గురించి, మాస్ ఎండి శ్రీ సివిఎస్ రెడ్డి, అరబిందో అధినేత శ్రీ నిత్యానంద రెడ్డి రైతులతో చర్చలు

**ఇతర సేవలు :**

- రైతులు పశువులకు కూడా నీరు, గడ్డి అందించలేని పరిస్థితిలో, వ్యవసాయ ఉత్పత్తిదారుల సంస్థ, రైతులు కొనుగోలు చేసిన గడ్డికి, ఒక లోడుకు 4500 రూపాయల చొప్పున 81 మందికి ఇవ్వడము జరిగింది.





- ఎండాకాలంలో పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో, పీలేరు 4 రోడ్ల పోలీసు అవుట్ పోస్టు ప్రక్కన రెండు చలివేంద్రాలను ఏర్పాటు చేసి, ఏప్రిల్ నుంచి వేసవి వెళ్ళేవరకు ప్రతిరోజూ శుద్ధి చేసిన మంచినీటిని అందించడం

పీలేరులో ప్రతి మంగళవారం వారపు సంతలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు మంచినీటిని అందిస్తూ కొనుగోలుదారుల,అమ్మకందారుల దాహాన్ని తీర్చడం జరుగుతున్నది. ■

సహనంతో వేచివుండే వారికి సకలం సమకూరుతాయి

# ఎఫ్ పి ఓ ల ఏ జి ఎం నిర్వహణ ప్రక్రియ !

సర్వసభ్య సమావేశం ఎంత తరచుగా అవసరమైతే అన్నిసార్లు జరగాలి. కనీసం సంవత్సరానికి ఒకసారైనా సభ్యులందరూ సమావేశమవ్వాలి. అదే ' వార్షిక సర్వసభ్య సమావేశం' ( ఏ జి ఎం). ఆర్థిక సంవత్సరం ముగుసిన ఆరు నెలలలోపు అంటే సెప్టెంబర్ 30వ తేదీ లోపున వార్షిక రిటర్న్ రిజిస్ట్రార్‌కు అందజేయాలి. కనుక పాలకవర్గం బాధ్యతగా ఆగష్టు 31 లోపు మహాసభ సమావేశం నిర్వహించాలి.

**సర్వసభ్య సమావేశానికి ముందు ...**

- గత (2018-19) సంబంధించిన లెక్కలను ఆడిట్ చేయించి, పట్టికలు , విశ్లేషణాత్మక నివేదికలను తయారు చేయాలి. ప్రతిపాదిత మిగులు లేదా లోటు నిధుల పంపిణీ తయారు చేయాలి.
- గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ప్రగతి నివేదికను తయారు చేసి, ప్రతులను సభ్యులందరికి ఇవ్వడానికి తయారు చేసుకొని ఉంచుకోవాలి.
- వార్షిక కార్యాచరణ ప్రణాళిక (బడ్జెట్‌తో సహా) 2019-20 ఆర్థిక సంవత్సరానికి తయారు చసుకోవాలి.
- మాస్ ప్రోత్సాహానికి సంబంధించిన యం ఓ యు గురించి చర్చించాలి.
- వార్షిక సర్వసభ్య సమావేశ నిర్వహణ కోసం కార్యక్రమాల వారీగా కొన్ని సబ్ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలి. ఉదా: వసతుల కమీటీ, అతిధుల ఆహ్వాన కమిటీ
- మహాసభలో ఆమోదం కోసం నియమావళిలో ఏమైనా సవరణలు అవసరమైతే చేయాలి, (నియామావళిలో ప్రస్తుతం ఉన్న నిబంధనలు, ప్రతిపాదిస్తున్న సవరణను, మహాసభ ఆహ్వానం, ఎజండాతో సభ్యులకు 20 రోజుల ముందు లిఖితపూర్వకంగా పంపించాలి).
- ఎన్నికలు జరపవలసిన కార్యవర్గం (కాలపరిమితి పూర్తయిన, రాజీనామా చేసిన లేదా బిఓడి చేత తొలగించబడిన) జాబితాను తయారు చేసుకోవాలి.
- ఎన్నికలలో ఓటు వేసే అర్హత కలిగిన సభ్యుల జాబితాను తయారు చేసుకోవాలి.
- నామినేషన్'లు వేయుట, విరమించుట, పోలింగ్ ఏర్పాటు మొదలగు అంశాలతో కూడిన ఎన్నికల కార్యక్రమాన్ని తేదీలతో సహా నోటీసుతో పాటు పాలకవర్గం ముందుగా ప్రకటించాలి.
- పై రెండు జాబితాలను సభ్యులందరికి తెలిసే విధంగా, కార్యాలయం నోటీసు బోర్డులో వుంచడంతోపాటు, వార్షిక సర్వసభ్య సమావేశం అజెండాలో పేర్కొనాలి.
- వార్షిక సర్వసభ్య సమావేశం జరిపే తేదీ, స్థలం, సమయం, అజెండాను నిర్ణయించి, 7 రోజులకు ముందే పంపించాలి. అయితే నియమావళిలో సవరణలు చెయ్యవలసివుంటే 20 రోజుల ముందుగానే సభ్యులందరికి లిఖిత పూర్వకంగా తెలియపరచాలి.
- మహాసభ సమావేశానికి సలహాలు సూచనలకై సంబంధిత వ్యక్తులను, సంస్థలను ఆహ్వానితులుగా సంఘ పాలకవర్గం పిలువవచ్చు.
- మహాసభకు అర్హులైన సభ్యులలో 1/3 వంతు మంది హాజరు (కోరం) ఉండాలి.




*పెంచుపాడు ఎఫ్ పి ఓ-ఏ జి ఎం*

**వేధింపు మితిమీరితే ఎంత చిన్న ప్రాణి అయినా తిరగబడుతుంది**




*ధరణి ఎఫ్ పి ఓ-ఏ జి ఎం*

- **మహాసభ సమావేశం అజెండా నమూనా**
  - ప్రార్థన
  - అధ్యక్షులచే ఆహ్వానం
  - గత వార్షిక మహాసభ సమావేశం మినిట్స్ సమర్పణ, ఆమోదం
  - గత సమావేశములో చేసిన నిర్ణయములపై ప్రగతి సమీక్ష
  - వార్షిక ప్రగతి నివేదిక సమర్పణ, ఆమోదం
  - వార్షిక అకౌంటు పట్టికలు, ఆడిట్ నివేదిక సమర్పణ, ఆమోదం
  - రాబోవు సంవత్సరం ప్రణాళిక, బడ్జెట్ సమర్పణ, ఆమోదం
  - మిగులు లేదా లోటు నిర్వహణ ఆమోదం
  - రిజర్వు నిధుల ఏర్పాటు, నిధుల నిర్వహణ, వాస్తవ వినియోగ సమీక్ష, ఆమోదం
  - పాలకవర్గ సభ్యుల పనితీరు మరియు లావాదేవీల పరిశీలన
  - ఆడిటర్ల నియామకం లేదా తొలగింపు ఆమోదం. ఆడిటర్లకు చెల్లించే పారితోషికం నిర్ణయం
  - నియామావళికి ఏమైనా సవరణల ఆమోదం
  - సమాఖ్యతో వివిధ కమిటిలలో సభ్యత్వం, లావాదేవీల సమీక్ష
  - పాలకవర్గంలో ఏర్పడ్డ ఖాళీ స్థానాలకు ఎన్నికలు లేదా పాలకవర్గ సభ్యుల తొలగింపు
  - అతిధుల సందేశాలు,
  - సన్మాన కార్యక్రమాలు. ఉదా: ఉత్తమ మహిళ రైతు, సేంద్రియ పద్దతిలో బాగా పండించే రైతు, రైతులకు మంచి కార్యక్రమాలను అందించిన సంస్థ వారికి (బ్యాంకు, వ్యవసాయ, ఉద్యానశాఖ మొదలైనవి)
  - కార్యదర్శిచే వందన సమర్పణ
- మహాసభలో జరిగిన చర్చలు , తీర్మానాలను మినిట్స్ పుస్తకంలో నమోదు చేసి, సభ్యులు, పాలకవర్గ సభ్యులు, అధ్యక్షుల సంతకం తీసుకోవాలి.

**సర్వసభ్య సమావేశం తర్వాత ....**

- వార్షిక మహాసభ ఆహ్వానితులకు మహాసభ సమావేశం మినిట్స్ ప్రతిని పంపించాలి.
- వార్షిక మహాసభ ముగిసిన 30 రోజులలోగా ఈ క్రింది రిటర్న్‌లను రిజిస్ట్రార్ కు పంపించాలి
- వార్షిక (2019-20) కార్యక్రమాల ప్రణాళిక
- ఆడిటర్ నివేదికను జతపరచిన వార్షిక లెక్కల ఆడిట్ నివేదిక
- వార్షిక సంవత్సరం చివరినాటికి సభ్యత్వ వివరాలు
- వార్షిక (2018-19) ప్రగతి నివేదిక (రైతు సంఘాలకు అందించిన సేవల వివరాలు)
- మిగులు / లోటు పంపిణి చేసిన విధాన వివరణ
- పాలకవర్గ సభ్యుల పేర్లు, చిరునామాలు, వారి పదవీ కాలాల వివరాలు
- వార్షిక సర్వసభ్య సమావేశం మినిట్స్ ప్రతి.
- రిటర్న్‌లు రిజిస్ట్రార్‌కు పంపించడానికి చెల్లించిన నగదు రశీదు. ■

**స్వభావం రాజు, అహంకారం బానిసఅయితే అన్నిటా గెలుపే, అంతటా ఆనందమే**

# ఎఫ్ పి ఓ సత్తా చాటిన క్షేత్ర దినోత్సవం !

– ప్రభావతి

**అ**నంతపురం జిల్లా నంబుల పూలకుంట మండలం గౌకానిపల్లి, మర్రికొమ్మదిన్నె, తూర్పునడింపల్లి అనే గ్రామ పంచాయతీల పరిధిలో 'ఆంధ్రప్రదేశ్ కరువు సంసిద్ధత కార్యక్రమాన్ని' (పల్లె జీవం) 'శ్రీ దుర్గా వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం' (ఎఫ్ పి ఓ) ఆధ్వర్యంలో 'ఫౌండేషన్ ఫర్ ఎకౌలాజికల్ సెక్యూరిటీ' (ఎఫ్ ఇ ఎస్) అనే సంస్థ ఫెసిలిటేషన్ ఏజెన్సీ (ఎఫ్ ఏ) గా, 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్) సంస్థ లీడ్ ఫెసిలిటేషన్ ఏజెన్సీ (ఎల్ ఎఫ్ ఏ) గా నిర్వహిస్తున్నారు.

**పొలం బడి**

రైతుల పంటల గురించిన సమస్యలను ఏదైనా ఒక రైతు పొలంలోనే అందరు రైతులు సమావేశమై, కలిసి చర్చించి పరిష్కారాన్ని కనుగొనే విధానమే 'పొలంబడి' అనే కార్యక్రమం. ఈ కార్యక్రమానికి ఔత్సాహికులైన 30 మంది రైతులు సూర్యోదయానికి ముందుగానే ఎంపిక చేసుకున్న పొలానికి వెళ్ళి, పంటల కాలంలోని వివిధ దశలలో వచ్చే సమస్యల గురించి చర్చించి, వాటి పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టాలో తెలుసుకుని, వాటికి సంబంధించి సస్యరక్షణ చర్యలు తీసుకునేలా రైతులలో మంచి అవగాహన తీసుకురావటమే ఈ పొలంబడి ముఖ్య ఉద్దేశం.

గౌకానిపల్లి గ్రామంలో శ్రీ దుర్గా వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘం ద్వారా మొత్తం 30 మంది రైతులతో ఈ కార్యాక్రమాన్ని ఎఫ్ ఇ ఎస్ సంస్థ వారు గత ఖరీఫ్ సీజన్‌లో ప్రారంభించి 2018 డిసెంబర్‌లో ముగించారు.

ఈ కార్యక్రమ ముగింపు సందర్భంగా, పొలంబడిలో 30 మంది రైతులు పొందిన అనుభవాలను మిగిలిన అందరు రైతులతో పంచుకోవటానికి రైతు క్షేత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ క్షేత్ర దినోత్సవానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లను శ్రీదుర్గా రైతు సంఘంలోని పాలకవర్గ సభ్యులు నిర్వహించటం విశేషం. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను, జిల్లా అధికారులను, ఎల్ ఎఫ్ ఏ వారిని ఆహ్వానించడంతోపాటు వారే కార్యక్రమాన్ని పూర్తిగా నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 230 మంది రైతులు పాల్గొన్నారు. మహిళా రైతులు దాదాపుగా 70 మంది పాల్గొనటం అభినందించదగ్గ విషయం.

ఈ కార్యక్రమములో ముఖ్య అతిధిగా ఆత్మ, ఏపిడిఎంపి డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీ కృష్ణమూర్తి హాజరయ్యారు. అలాగే మండల అభివృద్ధి అధికారితో సహా వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ, మైక్రో ఇరిగేషన్, సిరి కల్చర్, ఉపాధి




హామీ శాఖ, అంగన్వాడీ, హెల్త్ శాఖ మొదలైన అందరు మండల స్థాయి అధికారులు హాజరయ్యారు. శ్రీ దుర్గా వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘంవారే ఈ క్షేత్ర దినోత్సవానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలను స్వయంగా నిర్వహించడాన్ని అధికారులందరూ ప్రశంసించారు.

ముందుగా శ్రీ దుర్గా రైతు సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ గురివిరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ అధికారులను వేదిక పైకి ఆహ్వానించారు. రైతు సంఘం అధ్యక్షురాలైన బాలనాగమ్మ గారు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో మాట్లాడిన రైతులు ఈ క్రింద పేర్కొన్న విధంగా తమ అనుభవాలను పంచుకున్నారు.

1. గత 5 నెలలలో పొలం బడి నిర్వహణ విధానం

**అనుకున్నది నెరవేరనప్పుడు మరింత తపన,మరింత కృషి, చెదరని చిరునవ్వు మరింతగా అవసరం**

2. నీటిని గురించి, కరువు నివారణ చర్యల గురించి (ఉత్పత్తి -నిల్వ-వినియోగం)
3. పొలానికి పట్టిన చీడలు-నివారణ చర్యలు - వాటి జీవిత చక్రం
4. సేంద్రియ పద్ధతులు - కషాయాలు
5. దిగుబడి, ఉత్పాదకతలు

రైతు మహబూబ్ గారు నీరు ఉత్పత్తి, నిల్వ, వినియోగం గురించి వివరిస్తూ, రైతు నీటి పైన ఎక్కువ దృష్టి పెడుతున్నాడు కానీ పంటకు కావలసింది తేమ అని, కావున మట్టిలో తేమ ఎక్కువ రోజులు ఉండేలా తగిన పద్ధతులు పాటించే విధంగా మన వ్యవసాయ విధానం మారాలని తన తోటి రైతులకు వివరించారు.

రైతు రఘునాథరెడ్డి గారు నేలలో నీటి తేమ ఎక్కువరోజులు నిల్వ ఉండాలన్నా, భూసారం పెరగాలన్నా పొలంలో పూర్తిగా సేంద్రియ ఎరువులను వినియోగించాలని



పేర్కొన్నారు. కషాయాల గురించి మాట్లాడుతూ ఘన జీవామృతం, ద్రవ జీవామృతం నేలలో ఎలా భూసారాన్ని పెంచుతాయో వివరించారు. చీడపీడల నివారణకు పచ్చిమిర్చి, వెల్లుల్లి కషాయాలు, వావిలాకుల కషాయం గురించి ,వాటిని తయారు చేసుకోవలసిన తీరు గురించి తన తోటి రైతులకు వివరించారు.

ఈ కార్యక్రమంలో భాగంగా కొన్ని ప్రదర్శన మంటపాలను, ఏపిడిఎంపి ఫోటో ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. ఆ ప్రదర్శనాంశాలు:

1. మైక్రో ఇరిగేషన్ - పరికరాలు
2. పశువుల మేత రకాలు -ఉపయోగాలు



3. చిరుధాన్యాలు - ఉపయోగాలు
4. జడ్ఇబిఎ డెమో -ఉపయోగాలు
5. రైతు పొలంలో ఉపయోగించే ఆధునిక పరికరాలు
6. రైతు పొలంలో ఉపయోగించే సాంప్రదాయ పరికరాలు

ఆత్మ డిప్యూటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ గారు మాట్లాడుతూ ఇంత గొప్ప కార్యక్రమమును శ్రీ దుర్గా రైతు సంఘంలోని పాలకవర్గ సభ్యులే నిర్వహించినందుకు, మహిళా రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నందుకు అందరిని అభినందించారు. కరువును ఎదుర్కోవాలంటే రైతులు సంఘటితం కావాలని సూచించారు.

ఫెసిలిటేషన్ సంస్థ కోఆర్డినేటర్ విఆర్ స్వామిగారు మాట్లాడుతూ రైతులు సంఘటితమై కరువును ఎదుర్కోవడానికి తామే చర్చా వేదికలను ఏర్పాటు చేసుకొని, పరిష్కారాలను కనుగొంటుండడం అభినందనీయమన్నారు. ప్రతి రైతు వ్యవసాయ ఉత్పత్తిదారుల సంఘంలో సభ్యులుగా చేరాలని, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు శ్రీ దుర్గా రైతు సంఘానికి అన్నిరకాల సహాయ సహకారాలు అందించాలని ఆయన కోరారు. లీడ్ ఫెసిలిటేషన్ సంస్థ 'మాస్ ' డైరెక్టర్ జయరాంగారు పల్లెజీవం కార్యక్రమాన్ని గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో ఇంకా ఎఫ్.ఏ సంస్థ బృందం సహదేవ్ గారు, శ్రీరాములు గారు, ప్రభావతి గారు, ధనుంజయరెడ్డి గారు, ఉదయగారు, మహబూబ్ బాష గారు, జకారియా గారు పాల్గొన్నారు. అలాగే మాస్ ఏపిడిఎంపి బృందం పాల్గొన్నారు.

ఏపిడిఎంపి కార్యక్రమంలో భాగంగా రైతు సేవ కేంద్రాన్ని ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ గారు ప్రారంభించారు ■

కుటుంబ సభ్యులపట్ల ఓర్పు ప్రేమకు చిహ్నం, ఇతరుల పట్ల ఓర్పు గౌరవానికి సంకేతం

# బొర్డో పేస్ట్ కవచంతో మొక్క మొదళ్ళకు రక్షణ !

– జి. అమరేంద్రుడు

అనంతపురం జిల్లా అమడగూరు మండలం పూలకుంట్లపల్లె పంచాయతీలో, గోపాల్‌నాయక్ తాండ ఒకటి. ఈ ఊరిలో 72 గిరిజన కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడి జీవిస్తున్నాయి. ఇక్కడ ముఖ్యంగా చిన్న సన్నకారు రైతులు వున్నారు. వీరంతా వర్షాధారం మీద ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలు. వీరిలో ఆరు కుటుంబాల వారు ఉద్యానవన పంటలు వేసుకోడం జరిగింది. ఇందులో మామిడి, అల్లనేరేడు తోటలు ముఖ్యమైనవి.

ఏ.పి.డి.ఎం.పి. (పల్లె జీవం) కార్యక్రమంలో భాగంగా ఎఫ్.ఈ.ఎస్ సంస్థ గోపాల్‌నాయక్ తాండ లోని అభ్యాస క్షేత్రంలో ప్రతి నెల రైతు బడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా రైతులకు వ్యవసాయానికి సంబంధించిన వివిధ అంశాలపైన అవగాహన కల్పించడం జరుగుతున్నది. ఈ రైతు బడి కార్యక్రమంలో భాగంగా పండ్ల తోటల్లో బొర్డో పేస్ట్‌ను ఏవిధంగా తయారుచేసి వాడుకోవాలో ఎఫ్.ఈ.ఎస్ సంస్థ అగ్రికల్చర్ ఫెసిలిటేటర్ శ్రీ సహదేవన్ గారు రైతులకు అవగాహన కలిగించారు.

**బొర్డో పేస్ట్ తయారు చేయడం ఎలా ?**

**కావలసిన పదార్థాలు**

ఒక కిలో కాపర్‌సల్ఫేట్ (మైలు తుత్తం), ఒక కిలో సున్నం, రెండు ప్లాస్టిక్ బేసిన్లు , వంద లీటర్ల నీరు.

**తయారీ విధానం**

1 ఒక బేసిన్‌లో ఒక కిలో కాపర్ సల్ఫేట్ వేసి, 5 లీటర్ల నీరు పోసి కర్ర సహాయంతో బాగా కలియ తిప్పాలి.

2. రెండవ బేసిన్‌లో ఒక కిలో సున్నం, 5 లీటర్ల నీరు పోసి కర్ర సహాయంతో బాగా కలియ తిప్పాలి

3. తరువాత ఇలా తయారైన కాపర్ సల్ఫేట్ ద్రావణాన్ని సున్నపు ద్రావణంలో పోయాలి.

4. ఈ మిశ్రమ ద్రావణాన్ని కర్ర సహాయంతో బాగా కలియ తిప్పాలి. ఇలా తయారైన మిశ్రమ ద్రావణమే బోర్డోపేస్ట్!

**చేయదగినవి, చేయకూడనివి**

1. తయారు చేసిన బోర్డో పేస్ట్‌ను ఆ రోజే వాడాలి. నిలువ వుంచరాదు

2. లోహపు పాత్రలు వాడరాదు. ప్లాస్టిక్ పాత్రలు వాడాలి. కలియతిప్పడానికి కర్ర మాత్రమే వాడాలి

3. బోర్డో పేస్ట్ తో ఏ ఇతర మందు కలిపి వాడరాదు

**జాగ్రత్తలు:**

ఒక ఇనుప కొడవలి తీసుకొని ద్రావణంలో కొద్ది సమయం వుంచాలి. బయటికి తీసిన కొడవలి చిలుము





కోపమెందుకు? నీవు చెప్పేది సరైనదైతే కోపంతో పనిలేదు, సరైనది కాకుంటే కోపించే అర్హత లేదు

# రైతు సేవా కేంద్రం అందించే సేవలు !

– సుభాషిణి

పల్లె జీవం పథకంలో భాగంగా 'అన్నదాత' సంస్థ పని చేస్తున్న గాండ్లపెంట, మండలంలోని తాళ్ళకాల్వ, ఒ.డీ.సి మండలంలోని టి.కుంట్లపల్లి, పరిగి మండలంలోని సాసనకొట గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాలను లీడ్ టెక్నికల్ ఏజెన్సీ వాసన్ డిపిఎంయు, ఎస్‌పిఎంయు, ఎల్ఎఫ్ఎ (ఏపిమాస్), ఎఫ్ఎ (అన్నదాత) వారి సహకారంతో నిర్వహిస్తున్నారు.

ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా పల్లె జీవం పథకంలోని



భూలక్ష్మి రైతు సంఘం సభ్యులకు, సోమావతి రైతు సంఘం సభ్యులకు, సంఘమేశ్వర రైతు సంఘం సభ్యులకు సబ్సిడీతో రైతు రథాలను పంపిణీ చేశారు. ఇంతేకాకుండా స్ప్రేయర్స్, పవర్ వీడర్స్, టార్పాలిన్స్, పశుదాణా, విత్తనాల పంపిణీ జరుగుతున్నది. భూలక్ష్మి రైతు సంఘం రైతులకు వ్యవసాయ పరికరాలను సమయానికి అందించడంతో పాటు కొంత లాభాన్ని కూడా గడిస్తోంది. ఇప్పటికి 3200 రూపాయలు లాభం వచ్చింది. ప్రస్తుతం ఈ సంఘం ఎఫ్‌పిఓ లోని సభ్యులకు వేరుశనగ విత్తనాన్ని పంపిణీ చేసి మరింత లాభాన్ని పొందబోతోంది.



సంఘమేశ్వర రైతు సంఘ తన సభ్యులకు పొలం దున్నే ట్రాక్టర్‌ను ప్రయివేట్ వ్యక్తుల కంటె 100 రూపాయలు తక్కువ ఖర్చుతో అందిస్తున్నది. ఈ విధంగా 10 రోజుల కాల వ్యవధిలో 30 మంది రైతుల పొలాలను దున్ని 10,000 రూపాయలు ఆదాయం పొందింది.

సోమావతి రైతు సంఘం కూడా ట్రాక్టర్ ద్వారా 25,000 రూపాయలు ఆదాయం పొందింది.

ఈ రైతు సేవా కేంద్రాల ద్వారా అన్ని వ్యవసాయ పనిముట్లు సరైన సమయానికి పొందుతున్నామని రైతులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ■

---

పట్టినట్టు వుంటే మరి కొద్దిగా సున్నం కలపాలి ఆ తుప్పు రంగు పట్టనంత వరకు.

**బోర్డో పేస్ట్‌తో లాభాలు**

1. మొక్కలకు మిశ్రమం బాగా అంటుకుంటుంది
2. చౌకగా తయారు చేసుకోవచ్చు
3. చాలా తెగుళ్ళకు పని చేస్తుంది
4. పిచికారి చేసే మనుషులకు ప్రమాదకరం కాదు
5. కొన్ని బ్యాక్టీరియా సంబంధించిన తెగుళ్ళను నివారిస్తుంది

మామిడి, అల్లనేరేడు సాగుచేసిన రైతు కృష్ణానాయక్ మాట్లాడుతూ, తనకు వున్న 1.60 ఎకరాల పొలంలో మొత్తం 40 మామిడి, అల్లనేరేడు చెట్లు వున్నాయని చెప్పాడు. ఆ చెట్ల మొదళ్ళకు బోర్డో పేస్ట్‌ను పూసినట్టు ఆయన తెలిపారు. 'బోర్డో పేస్ట్‌ను మొక్క కాండంపై భూమట్టం నుంచి రెండు అడుగుల ఎత్తు వరకు పూయాలి. వర్షాకాలం కంటే ముందు జూన్‌లో ఒకసారి, నవంబర్‌లో ఒకసారి పూయాలి. ఇలా ఏడాదికి రెండుసార్లు పూయాలి' అని కృష్ణా నాయక్ తెలిపారు. సాధారణంగా పండ్ల తోటల్లో కొమ్మల కత్తిరింపు తర్వాత తెగుళ్ళు ఆశించకుండా బోర్డో పేస్ట్‌ను వాడుతారు. గ్రామంలోని 8 మంది రైతులు రైతుబడి అనంతరం తమ పండ్ల మొక్కలకు బోర్డో పేస్ట్ వాడారు. ■

# సైలేజ్ తయారీతో కరువుపై గెలుపు !

– ఎస్ ఎస్ రెడ్డి

**అ**నంతపురం జిల్లా, తనకల్లు మండలంలోని పెద్దపల్లి గ్రామం వినూత్న ప్రయోగాలకు పెట్టింది పేరు. పల్లెజీవం (ఏపిడిఎంపి) కార్యక్రమంలో పెద్దపల్లి గ్రామంకూడా ఉంది. మాస్ భాగస్వామ్య సంస్థ అయిన జనజాగృతి ఆ గ్రామంలో పనిచేస్తుంది. జనజాగృతి సంస్థ నాబార్డ్ సహకారంతో ఆ గ్రామంలో 'కె.ఎఫ్.డబ్ల్యూ నాబార్డ్ సాయిల్ ప్రాజెక్ట్ 'ను అమలు చేస్తున్నది. జనజాగృతి సంస్థ కరువును ఎదుర్కొనడానికి రైతులను, పాడి రైతులను సన్నద్ధులను చేస్తూ ఉంటుంది.





అందులో భాగంగా తీవ్రమైన కరువులో పాడి పశువులను కాపాడుకోవడానికి సైలేజ్ (మాగుడు) గడ్డిని స్థానికంగా తయారుచేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా నేర్పించాలని జనజాగృతి సిబ్బంది పాడి రైతులను సన్నద్ధులను చేసింది. ఎక్కడో యంత్రాల ద్వారా తయారయ్యే మాగుడు గడ్డి మన ఊరిలోనే తయారు చేస్తామనేసరికి రైతులు కూడా ఆసక్తిగా మొగ్గు చూపారు.

జనజాగృతి సంస్థ రైతులతో చర్చించి మాగుడు గడ్డి తయారు చేయడానికి ఏపిడిఎంపి ప్రాజెక్ట్ సాంకేతిక సహాయకుడు శ్రీ గంగాధరరెడ్డి సహకారంతో గ్రామంలోని తనకంటి బాస్కర్‌రెడ్డి గడ్డి వామిలో (6 x 5 x 4 ) కొలతలతో గుంతను తవ్వి, దానికి సిమెంట్‌తో ప్లాస్టరింగ్ చేయించడం జరిగింది. సైలేజ్ తయారీకోసం అదే గ్రామంలోని కేవీ రమణారెడ్డికి చెందిన 1.20 ఎకరాలలోని మొక్కజొన్న గడ్డిని 16,000 రూపాలకు కొనుగోలు చేశారు. మొక్కజొన్న గడ్డిని ముక్కలుగా చేయడానికి ఛాప్ కట్టర్‌లను కర్నాటకలోని కోలార్‌లో కొనుగోలు చేయడం జరిగింది. సైలేజ్ తయారీకి కావలసిన బెల్లం, యూరియా, ఉప్పు, పాలిథిన్ పేపరు కదిరిలో కొనుగోలు చేశారు. పాడి రైతులందరు ఏ రోజున సైలేజ్ చేయాలో ముందే నిర్ణయించుకుని, ఆ రోజు ఉదయాన్నే రైతులందరు మొక్కజొన్న గడ్డిని కోసి ట్రాక్టర్ సహాయంతో సైలేజ్ గుంత దగ్గరకు చేర్చారు. ఏపిడిఎంపి లైవ్ స్టాక్ సహాయకులు శ్రీ పి.విజయ్‌కుమార్ నాయక్ సూచనలు పాటిస్తూ బెల్లం, యూరియా, ఉప్పు తగుపాళల్లో డ్రమ్ములో వేసి, తగినంత నీరు పోసి ద్రావణాన్ని తయారు చేసుకొన్నారు. పాలిథిన్ షీట్‌ను గుంత పైభాగం వరకు వచ్చేలా గుంత అంతటా పరిచారు. రైతులందరు కలసి యంత్రాల సహాయంతో మొక్కజొన్న గడ్డిని ముక్కలుగా చేసి, పొరలు పొరలుగా గుంతలో వేసి అంతకుముందే తయారుచేసుకున్న ద్రావ ణాన్ని దానిపై చల్లుకొంటు బాగా గట్టిగా తొక్కుతూ గడ్డితో గుంతను నింపారు. తరువాత గుంతను ప్లాస్టిక్ పేపర్‌తో గట్టిగా కప్పివేసి గాలి చొరబడకుండా మట్టితో కప్పి వేశారు.

60 రోజుల తరువాత మండల వెటర్నరీ అధికారులను, రైతులను పిలిపించి అందరి సమక్షంలో గుంతను తెరచి, తయారైన మాగుడు గడ్డిని 25 మంది రైతులకు ఒక్కొక్కరికి 200 కేజీలు పంచి యిచ్చారు. ఈ గడ్డిని పాడి ఆవులు ఇష్టంతో తింటుండం చూసి రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సైలేజ్ గడ్డి పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఏడిఏ శ్రీ శివప్రసాద్ రాజు మాట్లాడుతూ తీవ్రమైన దుర్భిక్షానికి గురైన మారుమూల గ్రామంలో రైతులు సైలేజ్ గడ్డి తయారీపై ప్రత్యక్షంగా అవగాహన పొందడమే కాకుండా గ్రామస్తులందరు ఉమ్మడిగా పంచుకోవడం చాలా ఆనందాన్ని కలిగించిం దన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు జనజాగృతి సిబ్బందిని ఆయన అభినందించారు. సైలేజ్ గడ్డి తయారీ విజయవంతం కావడంతో భవిష్యత్తులో కూడా ఇలాంటి గడ్డిని తామే తయారు చేసుకుంటామని రైతులు ధీమాగా చెప్పారు. ■

**జీవితంలో ప్రతి పరీక్ష మన సామర్థ్యాన్ని మరింత పెంచుతుంది, లేదా చేతగానితనాన్ని చాటుతుంది**

## 'మాస్' 18 వ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన స్టాఫ్ రిట్రీట్ దృశ్యాలు !












MAHILA SADHIKARATHA
Publication Date: 01-07-2019; Posting Date: 05-07-2019

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20







స్మరజిత్ రే స్మారక ప్రసంగం కార్యక్రమంలో శ్రీ శ్రీరామ్. శ్రీ మాధవరావు , శ్రీమతి నందితారే లను మాస్ తరపున శాలువా, జ్ఞాపికలతో సత్కరిస్తున్న శ్రీ బి పి ఆచార్య





స్మరజిత్ రే స్మారక ప్రసంగం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న శ్రీ సి ఎస్ రెడ్డి




స్మరజిత్ రే స్మారక ప్రసంగం కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు, ఐ ఏ ఎస్ ప్రొబేషనర్లు

బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089